చిన్న నవల :

# వింధ్యాచలం

శ్రీ అడవి బాపిరాజు

## ప్రథమ భాగం

### ౧

నాకిది ఎన్నోసారో వింధ్యాచలం దాటి ఉత్తరాదికి వెళ్లటం! నేను అగస్త్యుణ్ణిమాత్రం కాను! అగస్త్యుడే పుట్టక పోయి ఉంటే ఆంధ్రులు దక్షిణానికి వలస వచ్చి కృష్ణాగోదావరీమధ్యస్థభూమిలో ఏలా వలస యేర్పరచుకొని వుందురు?

హిమాలయపర్వతంకన్న మేరువుపర్వతం కన్న పైకెగసి ధ్రువపథం దాటి సూర్యపథం దాటి సూర్యదేవకక్షకు అడ్డంగా పెరిగి సగర్వంగా నిలుచున్నాడుట వింధ్యపర్వతేశ్వరుడు. ప్రతిసంవత్సరం దక్షిణాయనంలో యవద్వీపప్రాంతాకాశపథాల సంచరించే సూర్యదేవుడుగారు ఆ ఏడు మళ్లీ ఉత్తరాకాశపథాల సంచరించటానికి వస్తూంటే ఈ వింధ్యాచలంగారు అడ్డం వచ్చారు. దక్షిణానికి ఒకటే రోహిణీకార్తి అవతరించింది. ఉత్తరభారతవర్షానికి ఒకటే మంచుముసుపైన చీకటి. అప్పుడు ఈ దేశభక్తుడైన అగస్త్యుడుగారిని దేవతలంతా రక్షించవలసిందని ప్రార్థించారుట. అగస్త్యమహర్షిగారు దక్షిణాపథయాత్ర సంకల్పించి బయలుదేరారు. వింధ్యాచలంగారు ఆయనకు భక్తితో గురుపాద నమస్కారం చెయ్యటానికి సాష్టాంగభూతుడైనాడు. "నేను తిరిగి వచ్చేవరకూ ఇలాగే వుండు నాయనా" అని ఆ దివ్యఋషి దక్షిణానికి వెళ్లినాడుట. వింధ్యంగారు అలాగే వున్నారుట.

ఇక నేను ఉత్తరాదికి వెళ్తూంటే పొరపాటున ఈ వింధ్యధరాధరేంద్రుడు మా బండిలోంచి తొంగి చూస్తోన్న నన్ను చూచి వీడే ఒక అభినవఅగస్త్యుడనుకొని, అగస్త్యులవారు తిరిగి ఉత్తరానికి వెళ్లిపోతున్నారు. ఇంక మనం ఒకనాడాక్రమించిన మహోన్నతోన్నతోన్నతోన్నతగగన పథాలకు ఉప్పొంగిపోదామని విజృంభించాడా, ఇంక ఉత్తర భారతదేశంలో జరిగే అల్లరి వర్ణనాతీతమై చక్కాపోతుంది. ద్రావిడైర్కషగంవాళ్లు వింధ్యపర్వతంతో కుట్రచేసి, ఆ వింధ్యపర్వతంగారికి ప్రోత్సాహమిచ్చి "నువ్వు నిక్కమైన తమిళుడవోయి వింధ్యన్నా! హిమత్పర్వతంగారు వట్టి శుద్ధమైన ఆర్యుడు, భారత ప్రధాని నెహ్రూగారు హిమాలయపర్వతమధ్యస్థభూమి అయిన కాశ్మీరములోంచి వచ్చిన నిఖారసుడైన ఆర్యబ్రాహ్మణుడు కాబట్టి నువ్వు మన ద్రావిడసంస్కారముయొక్క మహోన్నతోన్నత తత్వము కళ్మలం కాకుండా ఆకాశానికి ఎగిరి అడ్డంగా నిలువు", అని రామస్వామినాయకరు ఈ వింధ్యములైగారికి బోధించివుంటాడని ఏ హిందూస్థానీపైమెన్నో వ్రాయవచ్చును.

అది కాదంటారా కొంప ముంచి, ఈ కుట్ర అంతా ఆంధ్రుల నెత్తిమీద పడవేసే సావకాశాలు వున్నాయి. ఏ ఉత్తరాది కాంగ్రెసునాయకుణ్ణో

పత్రికావిలేఖరులు సందర్శించి "ఈ వింధ్యపర్వతము ఇలా పైకి పాకిపోవడానికి కారణం ఏమిటండీ?" అని కారణం అడిగారనుకోండి. అప్పుడా ఉత్తరాది నాయకుడు ఇలా చెప్పి తీరుతాడు. "ఈ మధ్య థార్ నివేదిక కొదండీ వచ్చింది! తత్ నివేదిక ఆంధ్రుల నందరినీ రోషానల సంతప్తహృదయాంత రంగుల చేసిపార వేయడంచేత, ఏ సాంబమూర్తిగారో ఈ వింధ్యపర్వతంగారికి ప్రోత్సాహ మిచ్చియుండ వచ్చును. దానితో పట్టపగ్గాలు లేకుండా ఈ అచలం గారు-చలంగారో—ఆకాశంలోకి చొచ్చుకుపోయి ఉండాలి." అని ఉద్ఘాటించి తీరుతాడు. ఇంకేముంది కొంపలు మునిగిపోతాయి. ఈలాంటి ఆలోచనలు ఆ వింధ్యపర్వతపులోయలో మహావేగంతో పోయే కలకత్తా మెయిలులో కూర్చున్న నాకు వచ్చినమాట సత్యం. జబ్బల్‌పూరు దాటినాము. నర్మదానదము దాటినాము. మా రైలు సిహోలీ రోడ్డు స్టేషన్ దాటి నది. ఒకొక్క స్టేషన్ మా రైలు సమీపించింది. అన గానే నా హృదయం మింటికెగసి లోతులకు పోతూ ఉంటుంది. నర్మద దాటేటప్పుడు పాలరాతికొండలు మాహిష్మతీనగరం జ్ఞాపకం వచ్చినవి. అటు ఢిల్లీవెళ్ళే దారిలో సాంచీస్తూపము జ్ఞప్తికి వచ్చింది. ఆ దారిని ఢిల్లీ వెళ్ళివుంటే అవన్నీ చూచివుండేవాణ్ణే! ఉజ్జయినీ ఆ పక్కనే వుంది. ఉదయనుడు, విక్రమార్కుడు, కాళిదాసు ఉజ్జయనీభావసంబంధాలు; ఇక్కడనుంచి ఉత్తరభారతభూమి పూర్ణరూపంతో ప్రత్యక్షమౌతుంది. ఆ ఉత్తరభారతభూమాత పోలికలన్నీ పుణికి పుచ్చుకున్న ఆమెఅనుగుబిడ్డ, ఒక బాల, కాట్నీ స్టేషన్‌లో మా సెకండ్ క్లాస్ పెట్టె ఎక్కింది.

## ౨

ఆ అమ్మాయివెనకే, ఈ నాటి ఈక్షణం ఫేషన్‌లోవున్న అతినవీన దుస్తులతో పెట్టె ఎక్కాడు ఓ యువకుడు. నేను ప్రయాణం చేస్తున్న పెట్టె, నాటి ఇంటరుతరగతి, ఈనాటి తరగతి రెండు. పెట్టంతా పూర్తిగా నిండి వున్నారు ప్రయాణీకులు. అది శీతాకాలంకాబట్టి సరిపోయింది. గడచిన రాత్రి అంతమంది ఉన్నా కూచున్నవాడు కూచున్నట్టూ, వరిగినవాడు వరిగినట్టుగానూ కాలంగడిపినాము! అదృష్టవంతుడు పైన పక్క వేసుకొన్నాడు.

రెండుబెంచీలమధ్యనూ, గేట్లదగ్గరనూ, ఎల్లా పడితే, అల్లా నిదురబోయాము తక్కిన వాళ్లం. ఉత్తరానికి వెళ్ళిన కొలదీ జనం ఎక్కువవుతూ వున్నారు. నేను సంస్కారమూ, స్త్రీభక్తీ కల వాణ్ణి కాబట్టి సౌందర్యపు పోగైన ఆ అమ్మాయి కాట్నీ జంక్షన్ స్టేషన్‌లో మా పెట్టెలోకి ఎక్క గానే ఎత్తు మడమల జోడుతోనూ, అతి నవీనమైన చీరకట్టువిధానముతోనూ ప్రత్యక్షమగుట చేత ఆమె కాలేజీలో చదువుకున్న బాలిక యని నిర్ధారణ చేసుకున్నవాడనై చటుక్కున లేచి, ఆమె ఇటూ అటూ చూస్తూ ఎక్కడ కూర్చుందామా అని ఆలోచిస్తున్న సమయంలో "మీ రిక్కడ కూర్చో వచ్చునండీ" అని ఇంగ్లీషుభాషలో ఆమెను కోరి నాను. "కృతజ్ఞురాలను" అని ఇంగ్లీషులో అంటూ నాల్గు చిరునవ్వులు నాపై విలాసంగా విసరివైచి, నాస్థలంలో ఆమె కూర్చున్నది. ఆమెవెనకాలే వచ్చిన యువకుడు ఆమెప్రక్కనే చటుక్కున సర్దుకు కూర్చున్నాడు.

నాకు వళ్ళు మండిపోయింది. నేను కూర్చుందా మనుకొన్న స్థలం కాదా అది? నేను లేచి హాయిగా వున్న నా స్థలం ఆమె కిస్తే ఈయనగా రెవరూ నాస్థలం ఆక్రమించడానికీ?

నేను ఆక్రిందటిరోజు సాయంత్రమే ఇటా ర్సీలో గ్రాండ్ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో దిగాను. నర్మదా నదిని చూచినట్లుంటుంది, జబ్బల్‌పూరునగరాన్నీ రైల్లోంచి దర్శించవచ్చును అని మరునాడు కలకత్తా మెయిల్ వచ్చేవరకూ ఉండి పదకొండుగంటలకు ఏలాగో మంచి తెలివితేటలు చూపించి ఆబండిలో చేరాను. కాట్నీ వచ్చేటప్పటికి సాయంకాలం అయి దున్నర అయింది. ఇంకా అయిదు గంటలు ఈ బండిలో వుండాలి. ఇన్ని గంటలూ ఆ అమ్మాయికీ ఆ అబ్బా యికీ నాస్థలం ఇచ్చేసుకుని నుంచోవలసిందేనా అని మరీ బాధ ఎక్కువైంది. ఒక నిట్టూర్పు విడిచి అలాగే

నుంచున్నాను. పైగా నుంచోడానికి కారణం నా చుట్టుప్రక్కల వున్న బెంగాలీవారికీ, యు. పి. వాళ్ళకూ ఇంకో రకంగా స్ఫురించకుండా వుండాలని ఇంగ్లీషులో, "ఎంతసేపని కూచోగలం కాళ్ళు సుదులు పెడితే, ఓ అరగంటైనా నిలుచుంటేగాని మళ్ళీ రక్తం స్రవించదు" అని పైకి అన్నాను. నాకూ గౌరవము దక్కింది. కానీ నేను అరగంటా నిల్చుంటానని గంట న్నర నిలుచున్నాను తలుపుదగ్గరే. పరుగెత్తే ప్రకృతి దృశ్యం గమనిస్తూ. ఆ అమ్మాయి పక్కన కూర్చున్న యువకుడు మే మిద్దరం ఎంతోకాలంనుంచి స్నేహి తుల మైనట్లూ, నేనేదో గౌరవంచేసుకోడానికని లేచి నిలుచుండినట్లు భావించాడు కాబోలు, నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం ప్రారంభించాడు.

యువకుడు : మీరు బొంబాయినుంచి వస్తున్నారా?

నేను : కాదు, బెజవాడనుంచి గ్రాండ్ట్రంక్ ఎక్స్ప్రెస్‌లో వచ్చి నిన్నల్లా ఇటార్సీలో కాలం వెళ్ళబుచ్చి ఇవాళ ఈ కలకత్తా మెయిలు ఎక్కినాను.

యువతి : మీరు ఆంధ్రులా అండీ?

నేను : ఔనండీ, మీరు బెంగాలీవాళ్లలా లేరే?

యువతి : మేము యు. పి. వాళ్లము. మాది అలహాబాదు.

నేను : నేనూ అలహాబాదు వెడుతున్నాను.

యువతి : మేమూ అలహాబాదే వెడుతున్నాము. ఇక్కడ కాట్నీలో మా యింటికి వచ్చి ఈ శెలవులు గడిపి అలహాబాదు వెడుతున్నాము.

నేను : మీరు అక్కడ ఉద్యోగమా అండీ? (యువకుణ్ణి ప్రశ్నించాను.)

యువకుడు : ఔను! కలెక్టరేటులో అసిస్టెంటు కలక్టరుగా పనిచేస్తున్నానులెండి. ఈవిడగారు మిసెస్ సుప్రియా త్రిపాఠీ. నేను సుప్రియా త్రిపాఠిని లెండి. మాది కాట్నీ నగరం. మీ రెందుకు వస్తున్నారు అలహాబాదు? మీ పేరు తెలుసుకోవచ్చునా?

నేను: అ తప్పకుండా! నా పేరు ఎం. చతుర్వేది. ఆంధ్రంలో చతుర్వేదుల మల్లికార్జున శాస్త్రి. నేను ఆంధ్రాయూనివర్సిటీలో యం. యస్. సి. మొదటిగా కృతార్థుడనయ్యాను. అలహాబాదు యూనివర్సిటీవారు డి. యస్. సి. పరిశోధనకు స్కాలర్‌షిప్పుతో సీటు ఇచ్చినారు. అది పూర్తి కావచ్చినది. ఇది ఆఖరు సంవత్సరం. శీతాకాలంశెలవులకు ఇంటికి పోయి ఇప్పుడు వస్తున్నాను.

యువతి : మీరు చతుర్వేదులా? మా నాన్నగారి ఇంటిపేరు త్రివేది వారు. హైకోర్టులో మా నాన్నగారు ఎడ్వకేటుగా వున్నారు. ఈ పెద్దమనిషిగారు అలహాబాదులోనే అయిందికదా ఉద్యోగమని అత్తవారింట్లోనే మకాం పెట్టారు లెండి.

యువకుడు : అయితే, చతుర్వేదిగారూ అసలు నేను అలహాబాదు వేయించుకోవటానికి కారణం ఏమిటో ఆవిణ్ణి అడగండి.

యువతి : నా పేరు జ్యోతిర్మయి లెండి. అందుకనే వెలుగును గురించిన రహస్యాలన్నీ తెలుసుకుందామని అలహాబాదుయూనివర్సిటీ బి. యస్. సి. ఆనర్సు ఫిజిక్స్‌లో చేరాను. తానేమో నా చదువు పాడుచేయకూడదట, అలహాబాదులోనే వేయించుకున్నారుట ఉద్యోగం. ఈయనగారు 1945 సంవత్సరంలో తయ్యారై వచ్చిన ఐ. సి. యస్. లెండి.

నేను : త్రివేదులూ, త్రిపాఠులూ, చతుర్వేదులూ! బాగానే వుంది మన స్నేహం.

## 3

ఇంతట్లో "శాత్నా" పట్నం వచ్చింది. నా అదృష్టంకొద్దీ జ్యోతిర్మయిపక్కనే కూర్చున్న ఒక ముసలాయన, ముసలావిడ లేచి రైలుదిగి వెళ్లిపోయినారు. వాళ్లు లేచి వెళ్లడమేమి, నేను గబుక్కున వారి స్థానంలో కూర్చోట మేమిటి, మేము ముగ్గురం చక్కగా, హాయిగా సర్దుకు కూర్చున్నాము.

మాకు ముగ్గురకూ సంతోషం కలిగింది.

"మీరు మాకు ఏవిధంగానైనా చుట్టాలు కారు

కదా ?" అని జ్యోతిర్మయి పకపకా నవ్వుతూ నా వైపు తిరిగింది.

"ఆంధ్రులు ఆరువేల సంవత్సరాల క్రితం మనదేశం నుంచి కదలి కృష్ణా గోదావరీదేశానికి వలస వెళ్లిన వారేగా ?" అని ఆ యువకుడు సుప్రియు డన్నాడు.

ఉత్తరాదివాళ్లకూ, దక్షిణాదివాళ్లకూ ఇలా రైల్లో స్నేహం కుదరటం విచిత్రంగానే ఉంది. వాళ్లు గంగానదివాళ్లు, నేను గోదావరినదివాణ్ణి. గోదావరి, గంగానది పూర్వావతారము. గోదావరే ప్రాచీనజన్మఅట. త్రయంబకేశ్వరుడే గంగోత్రికడ, జటామకుటేశ్వరు డయ్యాడట. అలాగే కృష్ణ నుద్భవింపజేసిన మహాబలేశ్వరుడు. యమునా కృష్ణా నదు లొకే అవతారములు.

రైలు మాణిక్యపూర్ దాటినతర్వాత ఏదో మాటలసందడిని "మీకేం, మీరు చాలా అదృష్టవంతు లగుటచేత మీ రాష్ట్రం మీకు ఇదివరకే వచ్చి ఉంది, కాని మీ రాష్ట్రంవాడయిన నెహ్రూగారికి నా యందు ప్రేమ లేకపోవడంవల్ల ధార్ నివేదికపై ఏమీ చెప్పకుండా వూరుకొన్నారు" అని కొంచెం తీక్ష్ణంగానే అన్నాను. ఆ యువకునికి చాలా కోపం వచ్చినట్లున్నది. "మీకు రాష్ట్రం రాకపోతే ఏమి లోటు వచ్చింది చెప్పండీ ? మీ ఒక్కరిమీద ఇంకా రాజ్యం చేస్తున్నారా ?" అని అడిగినాడు.

నేను : ఎంత చక్కని భావం వెల్లడించారు ? మీ రాష్ట్రంఅవతల వున్న పంజాబుతోనో, ఇవతల వున్న బీహారుతోనో, అడుగునవున్న మధ్యరాష్ట్రాల తోనో కలిసిపోకూడదా? అలా కలిస్తే మీలో ఉన్న ఇంగ్లీషుతత్వము వదిలిపోవునేమో?

యువతి : ఇంగ్లీషు తత్వమంటే?

నేను : సామ్రాజ్య తత్వం.

యువ : అంటే తక్కిన దేశాన్నంతా మా చెప్పు చేతల్లో వుంచుకొని తక్కిన రాష్ట్రాలన్నీ మా సామ్రాజ్యం క్రింద ఉంచుకొన్నా మనేనా? మీ మాటల్లో ధ్వని అదేగా?

నేను : నిజమైన ప్రజాపరిపాలన అయ్యేటట్లయితే, ఈ ముప్పై సంవత్సరాలు వాదించి ఒప్పుకొన్న ధర్మసూత్రాలలో ఒకటికదా భాషారాష్ట్ర విభజన. అది వెంటనే స్వతంత్రభారతం ఎందుకు అమలులో పెట్టలేదు చెప్పండీ ?

జ్యోతి : ఇప్పుడు కేంద్రప్రభుత్వము అనేక విధాల కష్టాలు పడేటప్పుడు దానితో సహకరించక, అతి ముఖ్యం కాని భాషారాష్ట్రసమస్య యెందుకండీ?

నేను : మహాత్మాగాంధీజీ ఇంగ్లీషువారు కాస్త కాస్త స్వరాజ్యం ఇస్తానంటే ఒప్పుకున్నారా? స్వరాజ్యం వచ్చినప్పుడు సంపూర్ణ స్వరాజ్యంరావాలి. దేశంలో ఒక భాగానికి స్వరాజ్యం వచ్చి రెండో భాగానికి రాకుండా వుండటమా?

యువ : అయితే ఆంధ్రులకు స్వరాజ్యం రాలేదంటారా?

నేను : ముమ్మాటికి రాలేదంటాను. మీ భార్యాభర్త లిద్దరూ బయలుదేరి ఆంధ్రదేశంవెళ్లి ప్రతి ఆంధ్ర స్త్రీనీ పురుషునీ ప్రశ్నించండీ! ఎంత బాధతో ఆంధ్రులు యావన్మందీ కృంగిపోతున్నారో?

శంకర్ ఘర్ స్టేషన్ వచ్చి వెంటనే వెనక్కు వెళ్లిపోయింది.

యువతి : ఈ రాష్ట్రాల సంగతి అలా ఉంచి మా ప్రార్థన ఒకటి వుంది వింటారా? నేనూ, మావారూ కలసి అడుగుతూన్నాము. మన బండి అలహాబాదు చేరేసరికి పదకొండు అవుతుంది. మీరు మాతో యింటికి రావలసిందని కోరుతున్నా నా తరఫునా, మా ఆయన తరఫునా.

యువ : మా రాణీగారు నా మనసులో వున్నది నిమిషంలో గ్రహించారు. మా అత్తవారి ఇల్లు పెద్ద మేడ. మీరు యూనివర్సిటీహోష్టలులో మీబసకు పోయేలోపున మా ఇంట్లో నాలుగురోజులపాటు వుండాలని మనవి. మా మామగారు కొంచెం పూర్వ సాంప్రదాయంవారు. మీరు మాకు అతిథులుగా ఉండమని కోరుతున్నాము.

యువతి : మేము పూర్తిగా శాకాహారులమే నండోయ్!

నేను : మిమ్మల్ని ఇబ్బంది పరుస్తానని భయం.

యువతి: ఏమీ భయం లేదు. మా చెల్లెలు వుంది. నా కన్న అందంగా ఉంటుంది. నా కన్న మధురంగా పాడుతుంది. రెండో ఏడు బి. యస్ సి. కెమిస్ట్రీ చదువుతోంది.

యువ : కాని మా ఆవిడలా చిలకలా గంటల కొలదీ మాట్లాడదు. బాపూజీ మౌనవ్రతంలో ఏ శుభ ముహూర్తంలోనో పుట్టివుంటుంది ఆవిడగారు.

యువతి : మీరు ఏమీ మాట్లాడలేని సంగ నాచులు!

౪

ఏవేవో ఆలోచనలలో పడినాము. రైలు వేగంగా వెడుతూవున్నది. మాకందరికి కొంచం నిద్ర మైకం కూడా వచ్చింది. ఇంతట్లో నైనీజంక్షన్ వచ్చింది. మా కలకత్తా మెయిలు అక్కడ ఆగకుండా అలహాబాదుకే వెళ్ళిపోయింది. వచ్చింది మా స్టేషన్. మేమందరమూ త్రివేదిగారింటికే వెళ్ళినాము. నాకు వారి తల్లిదండ్రులు ఏ మనుకుంటారో అని భయం. కాని వారందరూ ఏదో దగ్గరచుట్టం వచ్చినట్లే చూచినారు.

వింధ్యాచలం వెనకనే ఉండిపోయినాడు. నర్మదా నదిభారతమాతకు మొలనూలై ప్రవహిస్తూనే వున్నది. నే నీ త్రివేణీసంగమపవిత్రస్థలానికి వచ్చి చేరినాను. ఇక్కడి వారికీ ఆంధ్రులకూ అన్ని ఆచారాలూ తేడాగానే వున్నాయి. వారి భోజనాలు వేరు. వారు గోధుమరొట్టెలు ఎక్కువ తింటారు. వారి తర్కారీలకు మన కూరలకు సంబంధం లేదు. వారు పులుసులలో చింతపండు వేయరు. కొందరు మామిడిపొడుగు, కొందరు ఆల్చకరా వేస్తారు. వారికి పచ్చళ్లు ముఖ్యం కాదు. ఆవకాయ ముఖ్యం కాదు. ఊరగాయలు అనేకరకం.

కాని ఇవన్నీ వింధ్యాచలం వేరు చేసిందా? అయితే అరవవారి భోజనానికీ తెలుగువారి భోజనానికీ అంత తేడా ఉందేమి? ఆచారాలుమాత్రం పైపైన తేడాలేగాని అసలు మడీ గిడీ స్నానం శుద్ధి జపం తపం వారికీ వీరికీ ఒకటే.

త్రిపాఠీ ఐ. సి. యస్. గనుక ఆ యువకునకు ఛాందసాలు ఏమీ లేవు. భారతీయుని హృదయం ఒకటే! సంస్కృతి ఏలాంటి మహారాజపథాలు నిర్మించ లేదు గనుకా! భారతజాతికి విముక్తి వచ్చిన ఈ దినాల్లో సర్వదేశాలకూ ఆదర్శము కాగల రాజ్యాంగచట్టం భరతదేశం నిర్మించుకుంటోంది. భాషలు తేడా అయితే హృదయాలు తేడాలు కావాలా? పంజాబు బెంగాలు అల్లరులు, తూర్పు పశ్చిమపాకిస్థానులనుండి కోట్ల కొలది హిందువులను భరతదేశానికి తరిమివేశాయి. ఆ కాందిశీకులు భరతదేశం అంతా వలస ఏర్పాటు చేసుకోవలసివచ్చింది. వారి ఆచారాలు, వలస రాష్ట్రాల ఆచారాలూ, సంస్కృతులూ పవిత్రప్రయాగ అవుతున్నాయి. ఒక మహాకష్టంలోంచి ఒక దివ్యమైన శుభమూ అవతరిస్తున్నది. ఈ ఆలోచనలతో నిదుర కూరినాను.

౫

నేను త్రివేదీగారింట్లో ఉన్న మూడవదినాన సాయంకాలం జ్యోతిర్మయి చెల్లెలు ఆనందమయి నేను అతిథిగా మకాం చేసిఉన్న గదిలోనికి వచ్చి, "నమస్కార్ చతుర్వేదిజీ!" అని రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, నా సోఫాకు ఎదురుగుండా ఉన్న ఆసనం అధివసించింది.

ఆనంద : మీ చదువేమీ పాడుచేయటం లేదు గదా?

నేను : ఎబ్బెబ్బె, నేను ఏవో ఆలోచనలలో తేలిపోతున్నాను లెండి. వానికీ నా చదువుకీ ఏమీ సంబంధం లేదు.

ఆనంద : అలాంటి ఆలోచనలలో తేలిపోయారంటే, భూగ్రహణ శక్తికి మీరిపోయిన విశ్వపథంలో పడిపోయి మళ్లీ ఈ లోకానికి రారేమో?

నేను : (నాకు నవ్వువచ్చి పకపక నవ్వినాను) అప్పుడు ఇతర లోకాలే వైనా కొత్తవి కనుక్కొని "రాడార్" ద్వారా మీకు కబురు పంపుతాను!

ఆనంద: అప్పుడు మీకు నెహ్రూమీద కోపం పోతుందనుకుంటాను.

నేను: నాకు నెహ్రూమీద కోప మేమిటండోయ్?

ఆనంద: మొన్న ప్రయాణంలో వస్తూ దారంతా అదేటగా మీ వాదన!

నేను: రామ రామ! నాకు నెహ్రూజీమీద ఉన్న భక్తి అపారం. నాహృదయంలో ఆయన మహాత్మాజీకి నిజమైన ఆశయపుత్రుడన్న సంపూర్ణ నమ్మకం. ఎటు వచ్చినా, మా ఆంధ్రులకు అన్యాయం చేసేవారి కుట్రలకు నెహ్రూపండితులు, అన్ని విషయాలూ తెలిసిఉండి చేయూత ఇస్తున్నారని బాధపడుతున్నాను.

ఆనంద: తెలిసిఉండి చేయూత ఇస్తున్నారనా మీ అభిప్రాయం?

నేను: తెలిసిఉండి సహాయం చేస్తున్నారా, అది తీరని తప్పు. తెలుసుకోకుండా సహాయం చేస్తున్నారా, అది మరీ తప్పు.

ఆనంద: ఆలాంటి దోషవిషయాలకు ఆయన చేయూత ఇస్తున్నారనే మీ నమ్మకం?

నేను: చేయూత ఇస్తున్నారంటే తాను చేయాలని సహాయం చేస్తున్నారని నా అభిప్రాయం కాదు. అందరూ గాంధీజీశిష్యులనీ, అందరూ ధర్మపథాన్ని నడవవలసిఉందనీ, ఆలా వివిధాభిప్రాయాలవారూ ధర్మం నెరవేర్చడానికి సంకల్పం వహిస్తే ఉత్తమ మార్గం అప్పుడే ద్యోతకంఅవుతుందనీ, నెహ్రూగారి అభిప్రాయమని నా నమ్మకం. అదేగా వారు మద్రాసునకు వెళ్లి మంత్రివర్గంవారికి బోధ చేసింది.

ఆనంద: ఇంక మీరు బాధపడవలసిన అవసరం ఏమిటి? మీ ఆంధ్రుడైన పట్టాభిగారు రాష్ట్రపతి అయినాడు. మీ ఆంధ్రుడే కళావెంకట్రావుగారిని ఆయన ఒక కార్యదర్శిగా చేసుకున్నారు. ఇక మీకు ఆంధ్రరాష్ట్రం సత్వరంగా రావచ్చు కాదా?

నేను: నిజమే, మీ రన్నదానిలో నిజం లేకపోలేదు. ఆంధ్రుడు రాష్ట్రపతి కావడం మాకు అదృష్టకారణమే అవుతుందో, దురదృష్టకారణమే అవుతుందో! భవిష్యత్తు భగవంతుని చేతిలో ఉంది.

ఆనందమయి తాను కూర్చున్న కుర్చీలోనుండి లేచి నా దగ్గరకు వచ్చి నా భుజంమీద చేయి వైచి "ఆంధ్రులకు రాష్ట్రం విషయంలో ఎంత గాఢకాంక్ష ఉందో, ఆశ్చర్యమే! మీ బాధ మాకేం తెలుస్తుంది చెప్పండి. మాకాసమస్య ఎన్నడూ ప్రత్యక్షంకాలేదు." అని అంటూ "చతుర్వేదిగారూ మీరీ రెండేడులన్నర నుండీ ఈ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నారు కదా. మా యు. పి. వారు, మీ విషయంలో ఏలా సంచరించారు?" అని ప్రశ్నించింది.

ఆ బాలిక ఇరువది ఏడుల ఎలప్రాయపు జవ్వని. ఆంధ్రులలో సాధారణంగా కానరాని స్వచ్ఛసువర్ణచ్ఛాయ శరీరకాంతి గల మహోజ్వలాంగి. ఒయ్యారాల హంసయాన. నా భుజంపైన చేయి వైచినప్పుడు నాకు ప్రపంచమంతా మత్తిల్లి ఒరిగిపోయినట్లైనది. నాకు మాట రాలేదు. నా ప్రజ్ఞ అంతా పటాపంచలైనది.

నా హృదయావేదనాభరితమానం ఆమె అపార్థం చేసుకున్నది కాబోలు, నాప్రక్కనే సోఫాలో కూర్చుండి, "మిమ్మ మా రాష్ట్రం సరిగా ఆదరించలేదా, చెప్పండి?" అని ఆదుర్దాగానే ప్రశ్నించింది.

మీద చేయి వేస్తేనే, నేను మైమరచినవాణ్ణి, ఆమె నా దగ్గరగా సోఫాలో కూర్చుంటే నా స్థితి ఎవరికి గ్రాహ్యం కాగలదు? మాట రాలేదు. జవాబు చెప్పాలని ప్రయత్నం చేశాను. నోరు తడియారిపోయింది. హృదయమృదంగం భేరీభాంకారమై ద్రుతకాలమైపోయింది. ఏలాగో తెప్పిరిల్లగలిగాను. మాట తడబడుతోనే,

"ఆ...ఆ...ఆనంద...ఆనంద...మయీ దేవిగారు...అబ్బే ఏదో... ఆలోచనలలో...మాట్లాడలేదు.. మీ...మీ రాష్ట్రం నా యడల చూపించిన ప్రేమ..ప్రేమ...అపారం! మీ కుటుంబమే దానికి...దాని.. చిహ్నం అనుకోండి." అని అన్నాను.

అనాలోచితంగా జరిగే అనేకసంఘటనలు జీవితంలో విప్లవాలు తీసుకురావచ్చును. ఆనందమయి, నా హృదయంలో అవతరించిన తుఫాను ఏమి అర్థం చేసుకోగలదు?

నేను ఇరవై ఆరేళ్ల యువకుణ్ణి. బీదవాణ్ణి. చదువులలోమాత్రం ముందంజ గలవాడిని. లోకం నా చదువు చూచి నాకు సహాయం చేయ సంకల్పించింది. నేను దేహి అని ఇతరులను యాచించలేదు. హైస్కూలులో మా ప్రధానోపాధ్యాయుడు నాచదువు చూచే నాకు ఉచిత వేతనం ఇప్పించాడు. మా తండ్రి పురోహితుడు, స్వంత వ్యవసాయదారుడు. మాకున్నది రెండెకరాల మాగాణి. అదే మాకు జమీ. ఏలా సంసారం ఈదేవాడో ఏలా నాకు చదువుకై కర్చులు పంపేవాడో! కాలేజీలో అర్ధ ఉచిత వేతనం వచ్చింది. ఆంధ్రాయూనివర్శిటీవారు పూర్తిగా ఉచిత వేతనం ఇచ్చారు. అదే ఆశ్చర్యమన్నారు మావారు.

మా ఆంధ్రదేశం బ్రాహ్మణ బ్రాహ్మణేతర సమస్యతో మండి పోతోంది. గట్టిగా మాస్తే బ్రాహ్మణులలో లక్షాధికారులు పదిమంది ఉండరు. నూరు ఎకరాల మాగాణి ఉన్నవారు రెండు డజన్లుకూడా ఉండరు. ప్రజారాజ్యవిధానంలో బ్రాహ్మణుల ఓట్లు నూటికి ఒక్కటికూడా ఉంటుందో ఉండదో! గ్రామాలలో వారికి ఏమీ బలం లేదు. అయినా వారిమీద రెడ్డి, కమ్మ, కాపుకులాల వారి కున్న కోపం ఇంతింతని కాదు. అయినా ఆ కోపం పైపేనే అనే నానమ్మకం. సంస్కృతిలో పైకి విజృంభించి పోవాలన్న ఆ వేదనతో వారిపైన వారికే ఉద్భవించిన క్రోధం బ్రాహ్మణ ద్వేషం అని అనుకుంటున్నారని నా నమ్మకం. కాని ఈలోగా దేశం పొందే సంక్షోభం ప్రజాజీవితాన్ని కలచివేస్తున్నది. బ్రాహ్మణులపైన ఉన్న ద్వేషం మానసికనైర్మల్యాన్ని ధ్వంసంచేసి వారిలో వారికే ద్వేషం ఉద్భవింపజేసినది. అయినా ఇవన్నీ హృదయగతం కాకపోవడంవల్ల న్యాయం చేయవలసివచ్చినప్పుడు ఆంధ్రులు న్యాయపథము అనుసరించితీరుతూనే ఉన్నారు. అందుకనే నాకు మా ఆంధ్రాయూనివర్శిటీవారు విద్యావేతనం దయచేయించినారు.

నేడు అలహాబాదువారూ విద్యావేతనమిచ్చి నన్ను డి. యస్. సి. కి పరిశోధనచేయడానికి సావకాశం ఇచ్చినారు. దేశంలో ఎవరికి ఉన్న భావాలు వారు ఫలవంతం కావాలని ఆశిస్తారు. అవి కాకపోతే జరగలేదని విషాదం పొంది, అక్కడనుంచి ద్వేషాగ్ని ప్రజ్వరిల్లచేసుకొని ఈ సంస్థనూ, ఆ సంస్థనూ, ఈ వ్యక్తినీ, ఆ వ్యక్తినీ ఆడిపోసుకుంటారు. తమ జీవితాలు విచ్ఛిన్నం చేసుకుంటారు. ఇతరుల జీవితాలు విచ్ఛిన్నం చేస్తారు.

"మీరు నాకు కాస్త ఇంటిదగ్గిర పాఠాలు చెబుతూఉంటారా? మా నాన్న మీకు తగిన పారితోషికం ఇస్తారు. మీ రీ విషయంలో మొహమాటం పడకండి."

"అయ్యొయ్యో! అదేమిటండీ. ఆలాంటిమాటలని నన్ను బాధపెట్టకండి. నాకు వీలయినప్పుడు హాస్టలు నుండి వచ్చి సంతోషంతో మీకు పాఠాలు చెప్తాను."

"ఆ వీలు ఏ నెలకు ఒక మాటో అవుతుంది కాబోలు."

"వా! వా! అదా నా ఉద్దేశం."

ఈ బాలిక పేరు ఆనందమయి. ఆనందపూర్ణమైన జీవితమే రూపం కట్టిందా యీమె!

ఈ ఆలోచనలన్నీ రెండు మూడు నిమేషముల లోనే నాహృదయాన ప్రసరించిపోయినవి. ఆనందమయి నన్ను చూచి "ఏమిటండీ మీ ఆలోచనలు— యీ రెండు ఏండ్లు యిక్కడ చదువుకుంటూ వుండి కూడ మీ దర్శన భాగ్యం యెప్పుడు మాకు కలుగనిచ్చారు కాదు. మీ దక్షిణాదివాళ్లెప్పుడు యింతేనండీ!". అని ఆ బాలిక పకపక నవ్వింది.

"మేము దక్షిణాదివాళ్లము కాదండి. మేము తెలుగు వాళ్లము?"

"తెలగు వాళ్లు దక్షిణాది వాళ్లు కాకపోతే ఉత్తరాదివాళ్లా! నా కెప్పుడూ తెలియదే యీ విషయము?."

"మేము ఉత్తరాదివాళ్లము కాదండీ."

"అయితే మీరే ఆది వాళ్లు? తూర్పాది వాళ్లా, పడమటిఆదివాళ్లా?"

"మీరు తూర్పుఆదివాళ్లు బెంగాలీవాళ్లూ! అస్సాంవాళ్లూ. పడమటిఆదివాళ్లు రాజపుత్రులూ, గుజరాతీవాళ్లూ. నా వుద్దేశ మేమిటంటే దక్షిణాది వాళ్లంతా దక్షిణపెన్నకి దక్షిణంగా వుండేవాళ్లు మాత్రమే. వాళ్లు అరవవారు, మళయాళీవాళ్లూను, మేము దక్కనువారము.

"మీరూ, తమిళులూ, మళయాళీలూ, కన్నడులూ ఒక జాతికి చెందినవారు కాదా?"

"ఇలా జాతీ జాతీ తేడాలుగా చెప్పలేము. ఒకే భాషవారు ఒకే జాతి అని ఏలా చెప్పగలను? ఒకే భాష మాట్లాడేవారిలో—అనేక జాతులవారు కలిసిపోయి యుండవచ్చును, విడివిడిగాను ఉండవచ్చును. ఒకే జాతికి చెందినవారు వివిధ ప్రాంతాలలో వివిధ భాషలు మాట్లాడుతూవుండవచ్చును. వివిధభాషలలో వున్న సౌందర్యము ఉన్నతస్థాయిని పొంది సర్వ భారతీయమైన సంస్కృతిలో ప్రతియుక్తమైన భాగమౌతుంది. అప్పుడా సంస్కృతి మహత్తరమైన లాభము పొందగలదు."

"మీరు చెప్పింది నిజం"

నాకు ఆశ్చర్యమెక్కువైంది. నేమా వుత్తరాది వారికి, దక్షిణాదివారికి చాలా తేడా లున్నాయని వాదించడానికి సంసిద్ధుడనై యుంటిని. కాని ఆనందమయి దేవి నావాదన తీసుకోడమూ, నేను ఆమె వాదన బలపర్చడమైనది. ఈ సంగతి యిద్దరం ఒకేసారి గ్రహించాము. గ్రహిస్తూనే యిద్దరం పకపక నవ్వుకున్నాము.

౬

నేను మా విశ్వవిద్యాలయంహాస్టలుకు వెళ్ళిపోయాను. వెళ్ళి వారంరోజులవరకు త్రివేదిగారింటికి రాలేదు. తొమ్మిదవరోజు సాయంకాలం త్రిపాఠీ దంపతులూ, ఆనందమయీ త్రిపాఠిగారి కారు మీద మా వసతిభవనానికి చక్కావచ్చారు. నా గది నంబరు తెలిసిన త్రిపాఠిగారు రెండవమేడలో మూడవ అంతస్థులో వున్న నా ౨౦వ నంబరు గదికి గబగబా వచ్చి "హల్లో, చతుర్వేది" అని పిలిచారు. నేను అప్పుడే లైబ్రరీనుంచి వచ్చి టీ తాగి పడకకుర్చీలో మేను వాల్చి, ఆనందమయీసౌందర్యం తలపోసుకుంటూ ఏవేవో అంతులేని కలలు కంటున్నాను. త్రిపాఠీగారి పిలుపుకు ఉలికిపడి లేచి "మీరా త్రిపాఠీగారు, రండి, ఆ పడకకుర్చీమీద దయచేయండి. రెండు నిమిషాలలో టీ ఆర్డర్ చేసి చక్కావస్తాను" అని అన్నాను. ఆయనరాకకు నా ముఖం ప్రఫుల్లమైనట్లు నాకే స్పష్టమైంది.

"నాకు 'చా' వద్దు 'చీ' వద్దు. మీరు వెంటనే దుస్తులు ధరించి నాతో రావాలి. ఇవి ప్రభుత్వంవారి ఆజ్ఞలు." అని త్రిపాఠీ చిరునవ్వుతో హెచ్చరించాడు.

"ఏ ప్రభుత్వం వారు!" అన్నాను నేను.

"ఆ ఆజ్ఞలు మీకేమీ తెల్పడానికి వీలులేదు. రహస్యపు టపాలో వచ్చాయి"

గబాగబా ఉచితమైన వేషం వేసుకొని ఆయనతోపాటు కిందకు దిగి హాస్టల్ భవనాల ముందున్న తోటలోనికి వస్తిమి గదా — అక్కడ తోటరోడ్డు మీద త్రిపాఠీగారి కారు సిద్ధంగా ఉంది. ఆ కారులో జ్యోతిర్మయీ, ఆనందమయీ - ఇద్దరూ కూర్చుని వున్నారు. త్రిపాఠీగారు నన్ను వెనుకసీటులో ఆనందమయిప్రక్కన కూర్చుండమని తాను తన భార్యప్రక్క ముందుసీటులో కూర్చుని ఉన్నాడు. జ్యోతిర్మయి కారును మెల్లాకలిపి, గుర్రున నడక సాగింపించినది. నేను ముందుకు పడబోతే ఆనందమయి నన్ను రెండు చేతులతో ఆపుచేసి తనవైపునకు లాగుకొంది.

"కొంచమయితే పడిపోయి వుందురు. మా అక్క ఎప్పుడూ ఇంతే లెండి. ఆవిడ డ్రైవ్ చేస్తూవుంటే కొత్తవాళ్లయితే ప్రాణాలు ఎప్పటి

కప్పుడు ఎగిరిపోయిన వనే అనుకుంటారు. మాకు అల వాటు అయింది లెండి." అని అంటూ ఆనందమయి కొంచెం దూరంగా జరిగింది.

"అయితే దారిపొడుగునా మీరు నన్నిలా రక్షిస్తూ వుండవలసిందేనా యేమిటి ?" అని నవ్వుతూ అన్నాను.

"అలా అని అవసరం కలగకపోయినా నాకు పనికలిగించేందుకు ముందుకు వాలిపోకండేం!"

"పనికలిగిస్తే మీకు—"

"టర్నింగ్, వస్తున్నది. జాగ్రత్త చతుర్వేది గారు. గట్టిగా పట్టుకోండి"

"మళ్లీ టర్నింగ్ రానే వచ్చింది. ఆమె వొళ్లోకి నేను పడ్డాను. పాపం మళ్లీ నన్ను గట్టిగా ఆనంద మయి పట్టుకొన్నది. మా ప్రయాణం లక్నో రోడ్డు మీద సాగుతున్నది. నేను ప్రాణాలు బిగపట్టుకునే ఉన్నాను. అయిదు మైళ్లు ఆరీతిగా మా ప్రయాణం సాగింది. అక్కడ రోడ్డుప్రక్కనే మంచి తోట లోనికి మా కారును పోనిచ్చింది జ్యోతిర్మయి. నాకు తుఫానులో కొట్టుకుపోయిన విమానం జాగ్రత్తగా భూమిని వాలినది అనిపించింది.

త్రిపాఠి: ఈ తోట మా మామగారిది; చతుర్వేది గారూ. ఆయన ఈ తోటలో యెక్కడో పని చేస్తూనే వుంటారు. మనం నలుగురం కలసి కాసేపు టెన్నిస్ ఆడుకొని కాసేపు బ్రిడ్జి ఆడుకొని ఇక్కడే భోజనాలు చేయడం, ఇక్కడే ఈ రాత్రి మకాం. మా మామగారు కాసేపటికి యింటికి వెళ్లిపోతారు.

నేను : అయ్యో! నేను హాస్టలులో చెప్పి రాలేదే.

జ్యోతి : దానివల్ల మీకు నష్టమా?

నేను : నష్టం కాదనుకోండి.

త్రిపాఠి : ఉండవయ్యా! టెన్నిసుఆట కాగానే నేను కారుమీద పోయి టెలిఫోనుచేసి వస్తానులెండి.

నేను : మరి...మరి...

ఆనంద : నత్తి వస్తుందేమిటి చతుర్వేదిగారూ!

జ్యోతి : చతుర్వేదిగారు హాస్టలులో ఉండడం నాకేమీ బాగుండలేదు.

త్రిపాఠి : ఈ నెలాఖరునుంచి మన ఇంటిలోనే మకాం పెడతారులే.

నేను: అప్పుడు నా కిచ్చే ఉచితవేతనంలో కొంత తగ్గిస్తారు.

ఆనంద : ఎంత తగ్గిస్తారు. మీ హాస్టలుచార్జి వారే కట్టున్నారు. అది మానారు. ఏమిటి నష్టం?

నేను : అయ్యో! మీ ఇంటిలో ఉండడం ఏమి బాగుంటుందండి.

జ్యోతి : ఎందుకు బాగా వుండదు. మీరు వ్రాసే వ్యాసంవ్రాతకు మేమెవ్వరము అడ్డురాము. మీరు లేబరేటరీకి వెళ్లాలన్నా, లైబ్రరీకి వెళ్లాలన్నా, మా ఆనందమయి తానెల్లాగూ వెళ్లాలికనక కారులో మిమ్మలను తీసుకొనివెళుతుంది. మళ్లీ సాయంత్రం కాగానే కారులో తీసుకువస్తుంది. రాత్రిళ్లు మా అమ్మాయికి మీరు పాఠం చెప్పితీరాలి.

త్రిపాఠి : అసలు రహస్యం చెప్పేయరాదూ?

జ్యోతి : ఏముందిలెండి, ! చతుర్వేదిగారు హాస్టల్ లో వుండరని, మా యింట్లోనే వుంటారని మేము విశ్వవిద్యాలయఉపాధ్యక్షునికి చెప్పాము. హాస్టల్ వార్డనుకు చెప్పాము. ఈ సాయంత్రంనుంచే రారని చెప్పామండోయి.

త్రిపాఠి : మీ సామానంతా రేపు మాయింటికే వచ్చేస్తుంది. మీరు అసలు హాస్టల్ కే వెళ్లనవసరం లేదు.

ఆనంద: మీ గదిని వార్డెన్‌గా రెవ్వరికో ఇచ్చివేయడంకూడా జరిగింది.

వీరందరూ ఇలా అంటుంటే నాకు మతిభ్రమ ణమే కలిగిం దనుకొన్నాను.

నేను : ఏమిటండి! బ్లిట్జ్‌క్రీగ్.

జ్యోతి : బ్లిట్జ్ అని వెనుకటి యుద్ధంసంగతి మాట్లాడతారేం. వచ్చే యుద్ధంలో ఇది ఆటం క్రీగ్.

టెన్నిస్ ఆడుకొన్నాం. బ్రిడ్జిఆటకు కూర్చు

న్నాము. నేనూ ఆనందమయీ ఒకటి; జ్యోతిర్మయీ త్రిపాఠీ ఒకటి. ఇంతటిలో ఆనంద, జ్యోతిర్మయిల తండ్రి, త్రివేదిగారి కారు వెళ్లిపోతున్న చప్పుడయింది. మేము బ్రిడ్జి కత్ బర్ట్‌స్టన్ విధానాన్నే ఆడాము. వారు ముగ్గురూ ఆ ఆటలో నిధులు. నేనంత పెద్ద ఆటకాణ్ణి కాను. అందులో నా మనస్సు ఏమాత్రమూ నిలకడ లేకుండా పోయింది. ఆలోచనలు ఒక పక్క; ఆటలు ఒక పక్క. నేను రెండు ఆటలు అలా పాడుచేసేసరికి నాకు చాలా సిగ్గువేసింది. "ఇవాల్టికి ఈ ఆటతో చాలునండీ!" అని వారి ముగ్గురికీ కొంత సిగ్గుతో మనవిచేసుకున్నాను. ఆనందమయి లేచి నాదగ్గరకు వచ్చి "మీరు ఇంత మాత్రము ఆడుతారనుకోలేదండీ. రండి, అలా తోటలోకి షికారుకు వెడదాము" అని చేయిపట్టుకు లేవదీసింది.

ఆ అమ్మాయి ఇంత చనువుగా నాతో సంచరించడం నాకు ఆశ్చర్యం కలిగిస్తూనే వుంది. మేమిద్దరం పూలతోటలో తిరుగుతున్నప్పుడు ఆ అమ్మాయి నా ఆలోచన గ్రహించిందికాబోలు— "చతుర్వేదిగారూ, మా కందరికీ ఎందుచేతనో మీరు చాలా దగ్గరి చుట్టమైనట్లు భావం కలిగింది. నేనందరితోను యిలా చనువుగా వుండను. మా బావగారంటేనే దూరదూరంగా వుంటాను. ఒక్క మా అన్నయ్య అంటే చాలా చనువు. మా జ్యోతి మీరు తనకు కాసా అన్నగారయినట్లే భావిస్తుంది. మా చనువుకు మీ రేమీ అనుకోవద్దేం" అని అంటూ నా మొగంవైపు చూపులు ప్రసరించింది.

ఆనందమయి సాన్నిధ్యము నాకు నిజంగా మతి పోగొడుతున్నది. ఏమి మాట్లాడాలో నాకు తోచదు. ఆమెతో కూడా మౌనంగా తిరుగుతున్నాను. ఆమెకూడా మౌనం తాల్చింది.

నేను బ్రహ్మచారిని. అతిబీదవాడిని; కొత్త చదువులో పది మంది కన్నా నయమవడంచేత పరీక్షలో మొదటివాడుగా నెగ్గుతూవచ్చాను. నాకు వివాహం సంగతి ఎప్పుడూ తట్టలేదు. నేను చదువుకొనేటప్పుడు నా తోటివిద్యార్థినులు కాని, యితరబాలికలుగాని నన్నే విధంగానూ ఆకర్షించలేదు. వారిలో చాలామంది అందమైనవారేకాని నా బుద్ధి ఆడవాళ్లమీదనే ప్రసరించని రోజులలో వాళ్ల అందచందాలుకాని వాళ్ల తెలివితేటలుకాని నన్నేమి ఆకర్షించ గలవుకనక? బి. ఎస్. సి. పట్టం పొంది ఏ మంచిఉద్యోగమో సంపాదించుకొన్న తర్వాత వివాహంమాట ఆలోచిస్తానన్నాను. మా పెద్దలందరితోను. డబ్బు కలవాళ్ల పిల్లల సంబంధాలు వచ్చినవని నా తలితండ్రులు నా మేనమామ చాలా సార్లు ఒత్తిడిచేశారు. కాని నా నిశ్చయము ఏ మాత్రము వదలినాను కాను. ఇప్పుడీ ఆలోచనలన్నీ రావడం దేనికి? హిందూదేశంలో వింధ్యపర్వతేశ్వరుడు లేనేలేడా? గంగా గోదావరులు ఒకేచోట పుట్టాయా? సర్వసమమైన భావాలు మానవజీవితంలో చొచ్చుకు వచ్చినప్పుడే ఇది గంగ అది గోదావరి అవుతుంది. ఇది తూర్పుకనుమ అది పశ్చిమకనుమ అవుతుంది

ఆనందమయి చటుక్కున ఆగి 'చతుర్వేదిగారూ, మీకు మా ఎవ్వరిమీద కోపం కలుగలేదుకదా? నేను ఎప్పుడు మీతో మాట్లాడుదామని వచ్చినా మీరు ఏదో ఆలోచిస్తూఉంటా రేమి? మీరు మా యింట్లో ఉండడానికి అన్ని ఏర్పాట్లు చేసింది మా అక్కసుమండి ఆవిడకు నిజంగా మీవద్ద కొన్ని విషయాలు నేర్చుకోవాలని ఉంది. నాకు కొన్ని విషయాలు మా అక్కకు కొన్ని విషయాలు నేర్పుతూకూర్చున్నారంటే మీ కాలమంతా భగ్నమై మీ చదువుకు అంతరాయం కలుగవచ్చు. అయినా మా అక్క మాటను యెవ్వరూ కాదనలేము. ఆవిడ ఒకటి చెప్పిందంటే అది అశోకాజ్ఞ." అని తల వాల్చుకొని తొందరగా చెప్పినది.

మే మిద్దరము ఆప్రక్కన నున్న ఒక ఉద్యానవనాసనంపై కూర్చున్నాము.

"ఆనందమయీదేవిగారూ, మీరు నాకేమీ కష్టం కలిగించలేదు. పైగా పూర్తికావచ్చిన నా వ్యాసాన్ని బాగా ముగించడానికిన్నీ, వ్యాస మంతా మళ్లా మొదట్నుంచీ సరిచేసుకోడానికీ హాస్టల్ వీలైన ప్రదేశం కాదని అనుకొంటూవున్నాను. పైగా నా

వ్యాసం అంతా ఎప్పటికప్పుడు వూళ్ళో ఉన్న ఒక టైపుషాపుకు వెళ్లి టైపు కొట్టుకుంటున్నాను. అది రాత్రిళ్లు వీలు కాకుండా వున్నది. నేను టైపుమిషన్ కొనుక్కోలేను. మీ యింట్లో చక్కటి టైపుపెట్టెలు చూచాను. వీలుగా వుంటే ఆ టైపుపెట్టెను నేను ఉపయోగించుకోగలను” అని ఆమెతో నెమ్మదిగా అన్నాను.

౭

ఆ రాత్రిభోజనా లయినవెనుక ఆ తోటభవనంలో మేము చాలాసేపు రాజకీయాలు, సారస్వతాలు, కళలు, శాస్త్రవిషయాలు చర్చించుకున్నాము. ప్రస్తుతపరిస్థితుల్లో భాషాప్రయుక్తరాష్ట్రాలు వచ్చితీరా లని నా వాదన. భాషాప్రయుక్తరాష్ట్రాలు అనే భావమే సకలభారతావని ఒక్క మహాశక్తితో విజృంభించడానికి అన్నివిధాలా అడ్డమని త్రిపాఠివాదన.

నేను : ఉన్న భావాలు తీసివేయలేము. ఒకే భాష మాట్లాడేవారు సన్నిహితంగా రావడం తప్పించలేము; బ్రాహ్మణాబ్రాహ్మణవిభేదాలు మా రాష్ట్రంలో ఉన్నమాట నిజమే. అవి మీరాష్ట్రాలలో తక్కువ వుండవచ్చును. అయినా మా రాష్ట్రంలో వున్న బ్రాహ్మణ,బ్రాహ్మణేతరులు ఇతరరాష్ట్రాలలో వున్న బ్రాహ్మణ, బ్రాహ్మణేతరులకన్నా తమలో తాము ఎక్కువ సన్నిహితంగా వుంటారు.

త్రిపాఠి : అది నేను నమ్మను, మీ మద్రాసు శాసనసభసంగతులు చూస్తూవుంటే. మీ మంత్రిత్వపు గడబిడలు గమనిస్తూవుంటే తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, బ్రాహ్మణేతరులంతా ఒకటై ప్రకాశంగారి మంత్రివర్గాన్ని పడగొట్టారని స్పష్టంగా తెలుస్తున్నది.

నేను : అది అంతా పూర్తిగా నిజంకాదు. మొదటిసారి ప్రకాశంగారిని ఓడించడంలో ఎవరో ఒక రిద్దరు తప్ప చాలామంది తమిళ బ్రాహ్మణులు ప్రకాశంగారికి వ్యతిరేకు లయ్యారు. తెలుగువారిలో ప్రకాశంగారి తరఫున చాలామంది బ్రాహ్మణేతరులు వున్నారు. ఈ కక్షలన్నీ నా ఉద్దేశంలో వ్యక్తిసంబంధమైనవని. మాకు ఆనాడు కావలసింది కాంగ్రెసువారి రాజ్యం. అందులోకల్లా పెద్ద కాంగ్రెస్‌వారు ఆ పక్క రాజగోపాలాచారిగారు. ఈ ఇద్దరూ కలసి మంత్రివర్గం ఏర్పాటుచేసివుంటే మద్రాసురాష్ట్రవ్యవహారాలు చాలా అద్భుతంగా వుండివుండును. కాని, ఇక్కడకూడా భాష అడ్డువచ్చింది. రాజగోపాలాచారిగారు, ప్రకాశంగారు కలవడానికి ఏవో అడ్డు వచ్చాయి. ఇంతకూ నా వాదన సత్వరంగా ఆంధ్రరాష్ట్రం వచ్చితీరాలి.

జ్యోతి : అయ్యయ్యో! మీరలా అంటారు. మా రాష్ట్రమంతా ఒకేభాషేనా, అయినా చూడండి. కాంగ్రెస్‌వారిలో ఎన్నిముఠా లున్నాయో?

ఆనంద : నిన్నటివరకూ రాక్షసుల్లా కష్టపడ్డారు కాంగ్రెస్‌వారు; స్వరాజ్యం సంపాదించారు; రాజ్యరథం నడపడానికి పగ్గాలు చేతబట్టారు. ఇంక తమ దేశంమాట మరచిపోయారు.

నేను : ఎవరో నెహ్రూ, పటేలు, రాజేంద్రబాబు, ఆజాద్ - ఇంకా అలాంటి పెద్దలు తప్ప తక్కినవా రందరూ తామింకా అసలైన గమ్యస్థానం చేరలేదన్న విషయాన్ని మరచిపోయారు.

త్రిపాఠి : అది మరచిపోవడం కాదేమో. వారు అనుకోని, ఊహించలేని ప్రళయాలు వచ్చిపడ్డంచేత ఈమో స్తరుగా సంచరించవలసివచ్చిందేమో ఆలోచించారా?

నేను : మీ రన్నదానిలోనూ నిజం లేకపోలేదు. కాని అసలు గాంధీతత్వం వెనుకపడిందంటారా లేదా?

ఆనంద : నేను తప్పకుండా నిజ మంటాను.

జ్యోతి : నేను పూర్తిగా నిజం కాదంటాను. ఎందువల్లనంటారా బ్రిటిష్‌వారి పరిపాలనవల్ల నేమి, మరి భారతీయుల సంప్రదాయఛాందసంవల్ల నేమి మనలో మధ్యయుగపు భావాలన్నీ కరడుకట్టివున్నవి. గాంధీగారిని అనుసరించిన రోజులలోకూడా ప్రతి కాంగ్రెస్‌వీరుడూ నూటికి ౧౦ పాళ్ళు మాత్రమే అనుసరించాడు. ఆ మాత్రానికే అతడు వీరు డనుకున్నాడు.

ఆనంద : లేకపోతే స్వరాజ్య మెలా వచ్చింది?

నేను: ఇది నిజమైన స్వరాజ్య మంటారా ఆనందమయిగారూ! నిజమైన స్వరాజ్యమైతే పాకిస్థాన్ విడిపోనేపోదు. కాంగ్రెస్‌లో జైలుకు వెళ్లినవాళ్ళు దెబ్బలు తిన్నవాళ్లు, ప్రాణాలు కోల్పోయినవాళ్లు, ఆస్తులు పోగొట్టుకున్నవాళ్లు, ఎందుకు పనికిరాకుండా పోయినవాళ్ళు నూటికి ౧౦ పాళ్లు అనుసరించివుండినా పంజాబుహత్యలు నవఖాళిహత్యలు రానేరావు

ఆనంద : అవతారమూర్తి అయిన ఒక మహానుభావుడు ఉద్భవించినప్పుడు ప్రజలు ఆయనను నూటికి నూరుపాళ్లు ఎప్పుడూ అనుసరించనేలేరు. నూటికి ఏ అయిదుపాళ్ళు అనుసరించినా మానవసంస్కృతి ఎన్నో మెట్లు పైకి నడచిపోగలదు.

నేను : ఇంతకూ మీరు భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలంటారా అక్కర్లేదంటారా?

త్రిపాఠి : కొంతకాలానికైనా అవి పోవాలి. రాజ్యపరిపాలనాసౌకర్యంమాత్రంకోసమే రాష్ట్రాలు ఏర్పడాలి.

నేను : అలా ఏర్పడ్డంవల్ల రష్యాలో ఏమీ నష్టం కాలేదే? స్విట్జర్లాండులో ఏమీ కష్టాలు కలుగలేదే?

ఇలా మా సంభాషణ సాగించి మే మింత గట్టిగా వాదించుకొనడంవల్ల ఆంధ్రదేశానికి ప్రత్యేకరాష్ట్రం వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. దక్షిణాదిన వుండే ఆంధ్రులే ఆంధ్రరాష్ట్రానికి వ్యతిరేక మయినారు. భాష ఒకటైనంతమాత్రాన అందరినీ ఏకోన్ముఖంగా చేస్తుందా ఏమన్నా? ఆ రాత్రి రెండుగంటలకు నిద్రపోయాము.

తెల్లవారి ఆరుగంటలకు నాకు మెళకువ వచ్చింది. కళ్లు తెరచేటప్పటికి నా గదిలో గుమ్మందగ్గర నన్ను గమనిస్తూ ఆనందమయి నిలుచునివుంది. నేను ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను. "రాత్రి ఎంత నిద్రలేకపోయినా, నాకు పెందలకాడె మెలుకువ వచ్చేదండి ఈ వాళ నాకిలా పొద్దు తెలియకుండా నిద్రపట్టిం దేమిటో" అని కొంచెం సిగ్గుతోనే అన్నాను.

"మీ రేమీ కంగారుపడకండి. నేను ఒక్కతినే లేచాను. బావ అక్క ఇంకా నిదురపోతూనే వున్నారు; మీరు లేచారేమో, మీకు కాఫీ కావాలా టీ కావాలా, అని అడగటానికి వచ్చాను" అని అనందమయి అంటూ "మీరు ముఖం కడుక్కుని హాలులోకి రండి" అన్నది.

"నాకు కాఫీ అంటేనే యిష్టం. మీ దేశానికి వచ్చాక టీ కూడా అలవాటులెండి. అయినా ప్రొద్దున్నప్పుడు కాఫీయే పుచ్చుకుంటాను" అని అన్నాను.

"మీ హాస్టల్లో కాఫీ తయారుచేస్తా రండీ."

"తెలుగువాళ్ళము, అరవవాళ్ళము, కన్నడ వాళ్ళము కలసి పదిమం దున్నాము హాస్టల్‌లో. మావంటవాళ్లకి కాఫీ చేయడంకూడా నేర్పాము."

"అయితే మీరు నాకుకూడా నేర్పండి. నేను మా వంటవాళ్ళకి నేర్పుతాను."

మే మిద్దరమూ నవ్వుకున్నాము. ఆమె వెళ్ళిపోయింది,

హాలులో మే మిద్దరమూ ఉపహారాలు పుచ్చుకొనేసమయంలో జ్యోతిర్మయీ, సుప్రియాత్రిపాఠ మేడమీదనుంచి కిందకు దిగివచ్చారు.

౭

నా పరిస్థితి చిత్రంగానే ఉంది. త్రివేదీగారింట్లో నేనూ చుట్టాన్నయ్యాను. ఆ యింట్లో నన్నందరూ ఎంతో గౌరవంగానూ ప్రేమతోనూ చూస్తున్నారు. జ్యోతీంద్రనాథత్రివేదీగారు ఉత్తముడైనఅడ్వొకేటు. నెలకు ఇరవై ముప్ఫై వేలు ఆదాయం వస్తుంది. ఆయన మొదట మోతీలాల్ నెహ్రూగారిదగ్గిర జ్యూనియర్‌గా చేరినారు. భారతప్రధాని నెహ్రూజీతో ఆయన సమకాలికుడు. మొదటనుండీ కాంగ్రెసు అభిమానిమాత్రం. నెహ్రూకుటుంబం దేవతల కుటుంబం అని ఆయన నమ్మకం.

ఆయన సంప్రదాయాభిమాని. జపతపాదులు దైనందినధర్మంగా నిర్వహించే సనాతనవాది. అయినా సంఘంలో వచ్చే మార్పులంటే ఆయనకు ఇష్టమే! మరీ పెద్దమార్పులు తార్కికంగా ఆయన ఒప్పుకున్నా

వచ్చే ఉద్యమవిషయంలో ప్రథమసమయంలో ఆయన విముఖంగానే ఉండేవాడు. హరిజనులు దేవాలయాలకు రావడం ఆయనకు కిట్టలేదు. హిందూవివాహానికి విడాకులశాసనం తీసుకురావడం ఆయనమనస్సుకు వజ్రాఘాతంలా తగిలింది. మదరాసురాష్ట్రం సనాతనధర్మపూర్ణము అని ఆయన భావించుకొనేవారు. మదరాసురాష్ట్రవాసుల ఆచారాలు సనాతనధర్మపూర్ణాలనుకొన్నాడాయన కాని అక్కడ విడాకులచట్టం ఆయనకు ఆశ్చర్యం వేసింది.

అయినా ఆయనకు వేదకాలపు మహాఋషుల శక్తి అంటే అపారమైన నమ్మకం. ముందుయుగాలలో అవసరమైన మార్పులు వస్తూఉండేటట్లే వారు నిర్ణయించారనీ, రానురాను యుగాలు అవతరించినకొలదీ, ప్రపంచంలో అన్నిభాగాలూ వేదధర్మానుసరణమైన దివ్యభావాలు గ్రహించి భారతీయసంస్కృతిలో చేరిపోతాయని ఆయనకు గాఢవిశ్వాసం. మార్పు వచ్చినప్పుడు బాధపడతాడు. వచ్చిన కొద్దిసంవత్సరాలకు సమన్వయం చేసుకుంటాడు. మహాత్మగాంధి అవతారపురుషుడే కాని మాలవ్యా శివుని అవతారం. వీరిద్దరూ లోకసంగ్రహణానికి అవసరం, అని ఆయన వాదించుకుంటాడు; ఇతరులతో వాదిస్తాడు. శారదాశాసనం వలదని వాదించాడు. వచ్చినవెనక చాలా బాగుందన్నాడు. హిందూమహమ్మదీయసమన్వయం కూడదన్నాడు. కాని రానురాను మహాత్మజీని బాగా అర్థం చేసుకున్నాడు.

ఇంతకూ ఆయనకు ఉత్తరరాష్ట్రాల బ్రాహ్మణులే నిజమైన ఆర్యఋషిసంజనితులనీ, దక్షిణాది పంచద్రావిడులు, ఎవరో తురేనియన్ జాతులలోనుండి ఉద్భవించి ఉంటారనీ నిశ్చితమైన సిద్ధాంతసూత్రం! అందుకనే చతుర్వేది తన పంక్తిలో ఎప్పుడూ భోజనం చేయడం ఆయనకు ఇష్టంలేదు. త్రిపాఠి ఆంగ్లదేశాది పాశ్చాత్యదేశాలలో సంచరించి రావడం వల్ల అతడూ తన పంక్తికి బాహ్యుడే. అతని భార్య, తన పెద్దకూతురు జ్యోతిర్మయీ అంతే! ఒక్క ఆనందమయిమాత్రం తన ప్రక్కను కూర్చుని భోజనం చేయవచ్చును.

ఒకరోజు రాత్రి త్రివేదీగారి భవనంలోని హాలులో నవజవాన్లము మేము నల్వురమూ కూర్చుండి హోరాహోరి వాదించుకుంటూఉంటే త్రిపాఠీగారు అక్కడకు వచ్చి ఒక ఆసనం అధివసించినాడు. యువతీయువకులమైన మేము నల్వురం మౌనం తాల్చినాము. ఆయన నవ్వుతూ ఆనందమయివంక చూచి "బేటీ! ఏమిటటె మీరు వాదించే విషయం?" అని ప్రశ్నించాడు. ఆనందమయిని ఆయన గాఢంగా ప్రేమించాడు. అలా అని జ్యోతిర్మయి అంటే తక్కువప్రేమ కాదు. బ్రూటసు చెప్పినట్లు అతడు "సీజరును తక్కువప్రేమించుట లేదు; రోము అంటే ఎక్కువప్రేమ."

ఆనందమయి : దాదాజీ! చతుర్వేదిగారంటారు: దక్షిణాదిబ్రాహ్మణులు అసలైన ఆర్యఋషిసంతతివారని. అక్క ఉత్తరాదిపంచగౌడులే నిసలైనవారంటుంది.

త్రివేది : నీవాదన?

ఆనం : నేను విద్యార్థినిని; అందుకని వాదనలన్నీ విని నా అభిప్రాయం నిశ్చయం చేసుకుందామని అనుకున్నాను.

జ్యోతిర్మయి : దాదాజీ చతుర్వేదిగారంటారు: రామాయణకాలంలో దక్షిణాదికి వలసవెళ్ళి, మహర్షులు ఆశ్రమాలు స్థాపించినారని సిద్ధాంతం ఉందిగదా! ఆ ఋషుల సంతతిలో తాము ఉద్భవించినారట. ఇక్కడ ఉత్తరాదిశకులు, హూణులు, పహ్లవులు తండాలు తండాలుగా వచ్చి ఆర్యులలో కలిసిపోయారట. వారిలో కొందరు క్షత్రియులైనారట; కొందరు బ్రాహ్మణులైనారట!

త్రివేది : నీ అభిప్రాయం సుప్రియా?

త్రిపాఠి : ఆవాదనా ఈవాదనా రెండూ శుద్ధనిష్ప్రయోజనాలే. చరిత్రాత్మకంగా నిజం గ్రహించలేము. కట్టి అంచనాలు, ఊహాగానాలు చారిత్రికసత్యం కాజాలవు. మన పంచగౌడులలో కాశ్మీరకులు, బెంగాలీలు, ఓఢ్రులు, సారస్వతులు, మత్స్యభుక్కులు మాంసభుక్కులు. మైథిలులు, ఘూర్జరులూమాత్రం

శాకాహారులుకదా. పంచద్రావిడులైన ఆంధ్రులు, కన్నడులు, తమిళులు, మహారాష్ట్రులు, మలయాళ నంబూద్రీలు–అందరూ శాకాహారులే.

త్రివేది: చతుర్వేదిగారూ, మీ సిద్ధాంతం అంతా పూర్తిగా చెప్పండి.

చతు: దక్షిణాదిని ఋష్యాశ్రమాలు రామాయణకాలంలో బాగా వెలిశాయి. అప్పటికి ఆర్యావర్తమైన ఉత్తరాది అంతా జనకీర్ణమైన గ్రామాలతో పట్టణాలతో నిండిపోయింది. కాబట్టి ఆర్య ఋషులు ఆశ్రమాలు హిమాచలంలోనన్నా నిర్మించుకోవాలి, లేదా దండకారణ్యంలో నిర్మించుకోవాలి.

జ్యోతి: అయితే అప్పటి ఋషులకు దండకారణ్యం అపవిత్రమూ, నివాసయోగ్యతారహితమూ అయిన ప్రదేశమని భావం ఉందికాదా అండి.

చతు: ఆర్యావర్తం ఎందుకు పవిత్రమైనదీ? ఆర్యఋషులు వర్తించడంవల్ల, యజ్ఞయాగాది పవిత్ర కర్మలు జరపడంవల్లా, తద్వారా ఆ ప్రదేశాలకు దేవతలు దిగిరావడంవల్ల కదా!

త్రివేది: అవును.

చతు: అయినప్పుడు వింధ్య దాటి శరభంగుడు, మతంగుడు, ఇంకా అనేకులు దండకారణ్యానికి పోయి ఆశ్రమాలు ఎందుకు నిర్మించుకొన్నారు? ఆ ప్రదేశం కూడా తమ యజ్ఞయాగాదులచే పవిత్రం చేయాలని కదా! కాని అప్పటి రాక్షసులైన నీగ్రోజాతి అడవి మనుష్యులు ఆ ఆశ్రమాలను నాశనం చేస్తూవుంటే వాటిని కాపాడేందుకు శ్రీ రామచంద్రుడు రాకలసి వచ్చింది. రాక్షసులను నాశనంచేసి ఆశ్రమాలు సుస్థిరం చేశాడు శ్రీ రామమూర్తి.

ఎవరు లొంగుతారు! పూర్వకాలంలో వాదనలో ఓడిపోతే తమ మార్గం మార్చుకునేవారని చరిత్ర చెబుతుంది. ఈనాడు న్యాయంగా వాదించుకోడాలు. అవతల వారిని ఏడిపించటడానికే వాదన. అలాని తెలుసుకోవాలని వచ్చి ఆ విషయం అర్థమయ్యే వరకూ పిడుగులా వాదించి, ఆ వెనక తమకు నచ్చితే ఆ వాదన ఒప్పుకునేవారూ ఉన్నారు.

౬

ఇంత వాదనలలోనూ ఆనందమయి మాట్లాడకుండా కూర్చుండి, ఎవరు మాట్లాడుతో ఉంటే, వారిని తీక్ష్ణంగా గమనిస్తూన్నది.

ఆనందమయి జ్యోతిర్మయీ దేవికన్న చాలా అందమైన అమ్మాయి. జ్యోతిర్మయే చాలా చక్కని బాలిక. ఇద్దరు అక్కచెల్లెళ్లూ సరస్వతీ, శారదలు. ఒకరికన్న ఒకరు అందంగా కనబడతారు. జ్యోతిర్మయికన్న ఆనందమయి ఒక ఛాయ ఎక్కువ. జ్యోతిర్మయి పూర్ణిమముందు చతుర్దశినాటి వెన్నెలైతే ఆనందమయి పూర్ణిమ జ్యోత్స్న. ఎంతో జాగ్రత్తగా గమనిస్తే గాని ఈ తేడా తెలియదు. ఇద్దరూ వికసించిన దేహసౌష్ఠవం కలవారు. ఆనందమయికన్న జ్యోతిర్మయి రెండేళ్లు పెద్ద. ఆ తేడా మాత్రం వాళ్లిద్దరిలో కనిపిస్తుంది.

ఇద్దరివీ సమనాసికలు. ఇద్దరివి విశాలమైన కళ్లు. కాని జ్యోతిర్మయి పెదవులు కొంచెం పెద్దవి. అనందమయి పెదవులు సనుంగా ఉంటాయి. జ్యోతిర్మయి పెదవుల అంచులు నవ్వుతున్నట్లు పైకి తిరిగి ఉంటాయి. ఆనందమయి పెదవుల అంచులు సమరేఖాంచలములై ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుంటాయి.

నాకు కళలలో ఏమీ ప్రజ్ఞ లేదు. నేను సంగీతం పాడలేను; బొమ్మలు వేయలేను; పాటలూ పద్యాలూ సృష్టించలేను. కాని నవలలన్నా, నవలలకన్న, నాటకాలన్నా, నాటకాలకన్న, కథానికలన్నా, కథానికలకన్న, పాటలన్నా, పాటలకన్న పూర్వకవుల కవిత్వమంటేనూ, మహాఇష్టం. నా చిన్న లైబ్రరీలో ఎన్నో తెలుగు ప్రబంధాలు, భారతసంపుట భాగాలు, పోతనామాత్యుని భాగవతమూ, ఉన్నాయి.

జ్యోతిర్మయి, ఉత్తరాది బాణీ సంగీతంలో మటికురాలు; కథకనృత్యంలో మంచి ప్రజ్ఞావంతురాలు. ఆనందమయికి బొమ్మలంటే ఇష్టం. ఆవిడ స్వంత గ్రంథాలయంలో భారతీయచిత్రలేఖనాన్నిగూర్చి, శిల్పాన్నిగూర్చి, వాటి ఆశయాలనుగూర్చి ఎన్నో గ్రంథాలున్నాయి. ఆమె సంగీతం పాడుతుంది. కాని

శాస్త్రంగా నేర్చుకోలేను. అక్కగారు కథకవిధాన నృత్యం నేర్చుకుంటూ ఉన్నప్పుడు తానూ కొన్ని కరణాలు అలవరచుకొన్నది.

ఆనాడు బ్రాహ్మణత్వాన్ని గూర్చి అలా వాదించుకొంటూ ఉంటే, దక్షిణాపథదేశాల బ్రాహ్మణేతర బ్రాహ్మణప్రశ్నను వాదనలోనికి తీసుకువచ్చి జ్యోతిర్మయి "ఒకవేళ మీ తమిళసోదరులు కొందరు వాదించినరీతి దక్షిణాదిబ్రాహ్మణులు ఆర్యబ్రాహ్మణులైతే అయిఉండవచ్చును.

నేను: నేను ఆవాదమూ ఒప్పుకోను. దక్షిణాది బ్రాహ్మణేతరులలో అనేకులు ఆర్యులే. మా రెడ్లూ, కమ్మవారూ, రాజులూ బలిజలూ ఒకనాడు బ్రాహ్మణులే. బౌద్ధమతజైనమతసంఘాతంవల్ల బ్రాహ్మణత్వం కోలుపోయి సచ్ఛూద్రులయ్యారు. అలాగే దక్షిణాది వెల్లాలులూ అంతే. కూర్గువారిలో చాలామంది అంతే!

త్రిపాఠి: ఇంతకూ ఈ వాదన ఏమి తేల్చినట్లు. నేడు మనకు కావలసినది, బలవంతమైన భారతము. అజేయమైన భారతము. మతాలూ, కులాలూ అన్నీ ఏకమైపోవాలి.

త్రివేది: హరహరా, ఇన్నియుగాలనుండీ హిమాలయంకన్న శాశ్వతంగా నిలిచిన సనాతనధర్మం నాశనమైపోవలసిందే?

నేను: నిజం మీరు చెప్పింది! ఆ ధర్మాన్ని ఎవరు నాశనం చేయగలరు?

త్రిపాఠి: అసలు ధర్మం మంటగలిసినా, సనాతనధర్మంమాత్రం ఎందుకు నిలవాలి దాదాజీ?

త్రివేది: సనాతనధర్మమే అసలు ధర్మం!

త్రిపాఠి: మానవధర్మం అంటూ వేరే లేదూ? ఈ కులాలు, ఈ మతాలు, ఈ భారతదేశం, ఈ ఋషిప్రోక్తమూ ఇదేనా మానవధర్మం?

నేను: సర్వకాలాలకు సర్వదేశాలకు సత్యమైన ధర్మ మేదో అదే ఋషులకు తపస్సులో దర్శనమిచ్చింది. కాని ఆ ధర్మం వేదంలోనూ, ఉపనిషత్తులలోనూ వ్యక్తం అయిఉంది. తక్కిన ధర్మశాస్త్రాలు కాలానుబద్ధాలు. అదీ మా రాధాకృష్ణపండితులు తెలిపింది.

ఆనంద: వారి పుస్తకం నాకు చదివి వినిపించి అర్థం చెప్పరూ చతుర్వేదిగారూ?

జ్యోతి: సైన్సుచదువు త్రివేణీలో సంగమించాలా?

త్రివేది: ఏమో చతుర్వేదిగారు అన్న ముక్క నాకు నచ్చలేదు. ధర్మశాస్త్రాలే వేదోపనిషత్తుల భాష్యాలు.

త్రిపాఠి: అంతే నంటారా దాదాజీ! మీరు పేరుపొందిన అడ్వకేట్లు. ధర్మశాస్త్రాలను లా పుస్తకాలలోనికి దింపినవారిలో దిట్టమైన ఒకరు. ధర్మశాస్త్రాలు కాలానుసరణంగా మారలే దంటారా?

త్రివేది: మారినాయి. కాని మూలధర్మం ఇంతైనా మారలేదు.

త్రిపాఠి: కులాలూ మతాలూ కలిసిపోతే మూలధర్మమైన బ్రహ్మపదార్థం మారుతుందా?

ఈ వాదన అంతటితో ఆగిపోయింది. హాలు గడియారం సంగీతంలా పదకొండు గంటలు కొట్టింది. "ఇంక పడుకోండి; చాలా ప్రొద్దుపోయింది." అంటూ త్రివేదీగారు లేచినారు. అందరం లేచినాము, ఎవరి గదులలోనికి వారు వెళ్లడానికి. "మూలధర్మం అనేది బ్రహ్మపదార్థం కాదనుకుంటాను. జీవితాన్నీ ఆధ్యాత్మికసత్యాన్నీ సమన్వయం చేయడంలో ఉద్భవించిన వరవడిరాయే, మూలధర్మం అవుతుం దనుకుంటాను. అదే భారతీయసంస్కృతి. ఆ సంస్కృతి దేశంఅంతా నిండి ఉందని నా నమ్మకం!" అన్నాను.

త్రివేదిగారు మేడమెట్లు ఎక్కబోతూ, "ఒకే సంస్కృతి భారతం అంతా నిండిఉందని నేననుకోను, దక్షిణభారతసంస్కృతికీ, ఉత్తరభారతసంస్కృతికీ చాలా తేడా ఉంది" అన్నారు.

"ఆ రెండూ ఒకే మహాసంస్కృతికి కవలపిల్లలలాంటివి కావా అండీ?"

"తరువాత మాట్లాడవచ్చులెండి" అని అంటూ ఆయన మేడమెట్లెక్కి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిపోతో ఉంటే మేమందరం వారికి నమస్కారాలు చేసినాము.

# వింధ్యాచలం

●

శ్రీ అడవి బాపిరాజు

### రెండవ భాగము

౧

ఏప్రిల్ వచ్చింది. నేను వ్యాసం, విశ్వవిద్యాలయంవారికి సమర్పించాను. జ్యోతిర్మయి ఆనందమయిల పరీక్షలయ్యాయి. నేను బాగా సహాయం చేశానట. అందుచే వాళ్ళిద్దరూ మొదటితరగతిలో కృతార్థులవుతారట. ఆ సహాయానికి వారు తాము నాకు తీరని బాకీకి లోబడిఉన్నారట.

ఆ నాలుగు నెలలు ఎంత హాయిగా గడిచిపోయాయో! ఆ కుటుంబంలో ఒకణ్ణయిపోయాను. ఆనందమయి నేనంటే నానాటికి విపరీతమైన భక్తిలోకి దిగింది. మొట్టమొదటిరోజుల్లో చనువు తగ్గించుకుంది. పాఠం అవసరం ఉన్నప్పుడే ఆమె చదువుకునే మేడమీద హాలులో మే మిద్దరం కలిసేవారం. సాయంకాలాలు మేము నలుగురమూ టెన్నిసు ఆడుకునేవారం. ఎప్పుడైనా మేము నలుగురమూ వారి తోటకు వెళ్ళేవారము.

మార్చి నెలలో త్రిపాఠీకి బారైలీ జిల్లా బదిలీ అయింది. ఆతడు తన వంటమహారాజుతో, పరివారంతో, బదిలీప్రదేశానికి పోయాడు. పరీక్షలు కాగానే నేనూ, జ్యోతిర్మయీ ఆనందమయిలూ కలిసి ఆయన ఉద్యోగనగరానికి వెళ్ళవలసిఉన్నదట.

మాది గోదావరీతీరం. పశ్చిమ గోదావరిజిల్లా. పెద్దకుటుంబం. మేము అయిదుగురం అన్నదమ్ములం. నేను మూడోవాడిని. నాకన్న పెద్దవాళ్ళిద్దరూ చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఒకడు రేడియోలో అసిస్టెంటు ఇంజనీరుగా ఉన్నాడు. తిరుచునాపల్లిలో పని. రెండవ అతడు బి. యే. ఆనర్సు ఆంగ్లభాషావిషయంగా మొదటి తరగతిలో కృతార్థుడై రాజమండ్రీ ప్రభుత్వకళాశాలలో సహాయ ఆచార్యపదవిని పొంది కాలక్షేపం చేస్తున్నాడు. నాకన్న చిన్నవాళ్ళిద్దరూ ఒకడు ఇంటరూ, ఒకడు వ్యవసాయకళాశాలలోనూ చదువుకున్నారు.

మాకు ఒక్కత్తే సహోదరి. ఆమె మా అందరికన్న పెద్దది. ఆమె నలుగురుబిడ్డల తల్లి అయినది. నాకు చాలా సంబంధాలు వచ్చాయి. కాని ఉద్యోగం లేకుండా, ఏవో నాలుగు రాళ్ళు సంపాదించుకుంటూ ఉండకుండా వివాహం చేసుకోనని పట్టుపట్టాను. నాకు ఇరవై నాలుగోఏడు జరుగుతూ ఉన్నది. నేను పరిశోధించిన విషయం చాలా ముఖ్యమైన విషయం. అలహాబాదు విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు, ఈ రోజుల్లో, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు, ఆ రోజుల్లో, నేను పాశ్చాత్య దేశాలలోని సైన్సు మాస పత్రికలకు వ్యాసాలు వ్రాస్తూ ఉన్నాను. అవి చాలా మెచ్చుకుంటూ ఉద్దండులైన పాశ్చాత్య పండితు లెందరో నాకు ఉత్తరాలు వ్రాసినారు, వ్రాస్తూ ఉన్నారు.

మేమంతా కుమాయూన్ జిల్లా, వెళ్ళి, త్రిపాఠీతో ఆ హిమాలయ కీకారణ్య ప్రదేశమైన జిల్లా అంతా తిరిగినాము. పెద్దపుల్లి బరిమీద తిరుగుతూ ఉంటే

కనుక్కొన్నాము. ఆ హిమాచలప్రజల ఆచారవ్యవహారాదులు గమనించాము. వారి దైనందిన జీవితంలోని కష్టనిష్ఠురాలు, దుఃఖానందాలు గమనిస్తూ ఈ ప్రజలకు భారతమందు ఇతర ప్రజలకు ఎన్ని పోలికలున్నాయో అని అనుకున్నాను. మామిడిజాతులు ఎన్ని వేలున్నా అవి రుచులలో, అసలు తత్వంలో ఒకటేకదా.

నేను తిరిగి వెళ్ళేసమయంవచ్చింది. నేనూ ఆనందమయీ, వాళ్ళదాదీ-ముగ్గురం కలిసి తిరిగి అలహాబాదువచ్చి, అక్కడనుంచి నేను దక్షిణానికి రావడం నిశ్చయం చేసుకున్నాము. త్రిపాఠీ,జ్యోతిర్మయీ ఎంతో ప్రేమ పూర్ణమైన వీడికోలిచ్చారు నాకు.

జ్యోతిర్మయి : చతుర్వేదిగారూ ఆంధ్రరాష్ట్రం కోసం మీరేమి ప్రయత్నాలు చేయదలచుకొన్నారు. ఆంధ్రరాష్ట్రంసంగతి తేల్చవలసిందని కాంగ్రెసుకార్య వర్గానికీ కాంగ్రెసు పెద్దపెద్దలకూ మీ ప్రకాశంగారూ రంగాగారూ గట్టిగా వినతిచేశారా? ఏం చేయగలరు వారు?

నేను : గవర్నరు జనరల్ చే వారు ఆర్డరు వేయించవచ్చును. పైసంవత్సరం జనవరినుంచి కొత్త రాజ్యాంగపు బిల్లు శాసనంఅవుతుందట. అప్పటినుంచీ అమలులోనికి వస్తుందట. అది రాకమునుపే ఆంధ్ర రాష్ట్రం రావాలి.

ఆనందమయి : వస్తుందని మీకు ధైర్యంగా ఉందా ?

నేను : రాజగోపాలాచారిగారు రానియ్యరండి,

త్రిపాఠి : అదేమిటండీ, ఆయనకు ఆంధ్రుల మీద కోపమా ?

నేను : కోపమని కాదు. ఆయన గాఢమైన రాజకీయ పరిజ్ఞానం కలవారు. తమిళులందరికి మదరాసు విషయంలో చాలా పట్టుదల ఉంది. కాని మదరాసు తమిళరాష్ట్రానికి వెళ్లినా, ఆంధ్రరాష్ట్రానికే పూర్తిగా వెళ్ళినా, ఎవరికో ఒకరికి నష్టం. అందరి కన్న ఎక్కువనష్టం తమిళబ్రాహ్మణులకు. మరీ నష్టం వర్తకానికీనూ !

ఆనం: మీరెలా అయితే బాగుంటుం దంటారు.

నేను : చరిత్ర అలా ఉంచండి. ఆ విషయం తేల్చాలంటే వీరి వాదనా నిజమే, వారి వాదనా నిజమే కాని ఈనాటి పరిస్థితులు గమనిస్తే మదరాసు రెండురాష్ట్రాలకి సమంగా పంచితే రాజ్యాంగనీతి మొంటి రకంగానిర్వహింపబడుతుం దని నాకు గట్టి నమ్మకం.

త్రిపాఠి : ఇదెక్కడ తీర్పయ్యా ! ఒక మహా నగరం రెండుగా విభజిస్తే వచ్చే కష్టాలు మనం తీర్చలేని వౌతాయి.

నేను : అది వట్టిమాట లెండి. కాదంటారా, రెండోరకం, మదరాసు నగరం కేంద్రప్రభుత్వ పాలన లోనే ఉండాలి. అప్పుడు తమిళబ్రాహ్మణులకూ, ఆంధ్రులకూ, మదరాసులో ఉన్న ఇతరప్రాంతాల వారికీ అన్యాయం జరగదు.

జ్యోతి : పండిట్జీ ఇప్పుడప్పుడే రాష్ట్రాలసంగతి తలపెట్టవద్దంటారు.

నేను : అదే పెద్దలకు ప్రజల హృదయం కొంచెమయినా తెలియ దన్నమాటకు సాక్ష్యం. ఆంధ్రులందరూ స్వరాష్ట్రం కావాలంటున్నారు. కాంగ్రెసుపెద్దలు ఆ విషయంలో జాప్యంచేసినకొలదీ ఆంధ్రులలో నిస్పృహ, నిరాశ, కాంగ్రెసంటే నిరసనా ఉద్భవిస్తున్నది. మా దేశంలో కమ్యూనిష్టులు దుష్ట చర్యలకు పూనుకున్నారు. గాని, వారే సరియైన మార్గంలో నడుస్తూ ఉంటే తప్పకుండా ఎన్నికలలో నెగ్గితీరుతారు.

త్రిపాఠి : సరి మార్గం లేదు గనుకనే, కమ్యూనిష్టుదురంతాలను అణచివేయడానికి వీలుగా ఉండడానికి రాష్ట్రవిభజన పనికిరాదన్నారు, ఆ కాంగ్రెసు పెద్దలే.

నేను : అవునండీ ! ఉత్తరాదివారికీ, దక్షిణాది వారికీ వింధ్యాచలం అడ్డురావడం అదేఅంటాను.

ఆనంద : అడ్డంరావడం లేదుగా ఇప్పుడు. అగస్త్యుడు.ఇంకా దక్షిణాపథంలోనే ఉన్నాడు.

త్రిపాఠి: కాంగ్రెసు వర్కింగుకమిటీవారు పటేల్ గారికీ, నెహ్రూజీకి, రాజేంద్రబాబుకూ తుది నిర్ణయం వదులుతారుటగాదా. అదేమి జరుగునో చూద్దాము.

ఆనంద: దేశంఅంతా మాకు రాష్ట్రం కావాలని వాంఛించేవారే. కాని సమయం ఉంది కాదా చతుర్వేదీ.

౨

రైలు బయలుదేరే వేళ అవుతున్నది. మేమంతా స్టేషనుకు వచ్చాము. బార్హైలీనుండి అలహాబాదుకు మేము ఇద్దరం రెండవతరగతిలో ఎక్కినాము. ఆనందమయి నాదగ్గరగా కూర్చుంది. మాతో వచ్చే దాదీ మూడవతరగతిలో ఎక్కింది. ఆనందమయి ఒక అర గంటసేపు మౌనంగా కూర్చుంది. నేనూ ఏవో ఆలోచనలకులోనై మాటలులేకుండా కూర్చున్నాను. నేనెక్కడ. ఈ త్రివేదీ కుటుంబం ఎక్కడ? ఏ పురాతనానుభూతివల్ల ఈ కుటుంబానికీ నాకూ ఈలాంటి సన్నిహిత స్నేహం ఏర్పడిందో! నేనున్న ఇన్నాళ్లూ నాకు ఈ కుటుంబం ఉందనే తెలియదే? వీరందరినీ వదిలి తిరిగి వింధ్యాచలందాటి దక్షిణాపథానికి వెళ్లిపోతాను.

"ఏమిటండి చతుర్వేదిజీ మీరాలోచించేది?"

"మిమ్మందరినీ వదిలి వెళ్లిపోవడం ఎట్లాగా? అని అనుకుంటున్నాను."

"మిమ్మల్ని కొన్ని ఆంతరంగికమైన విషయాలు నేనడగదలచుకొన్నాను. సిగ్గుపడకుండా నిజం చెప్పాలని ప్రార్థిస్తున్నాను. మీ వివాహవిషయమై ఏదైనా సంబంధం ఏర్పాటై ఉందా?"

నాకు ఆశ్చర్యం వేసింది. ఎందుకు ఈ అమ్మాయి నన్నీ ప్రశ్నలు వేస్తూవుంది. ఆ అమ్మాయి నాజూకుగా పొడుగుగా ఉన్న బాలిక. ఆమె ఒంటిపై బంగారం నల్లగా కనబడేటంత తెలుపు పసిమి ఎరుపుల రంగుతో వెలిగిపోయే బాలిక. పెద్దకళ్లు. కాటుక అంచులతో సగం దాగుకొనిన పెద్ద నీలి కనీనికలతో గంభీరమైన ఆలోచనలు లోన దాచుకునే బాలిక. ప్రతిఅవయవమూ తీర్చిదిద్దినట్లు, మేలిమి బంగారంతో పోతపోసిన విగ్రహంలా ఉంటుంది. కోలమోము, సమనాసిక, నిండు పెదవులతో విలువంపులు తిరిగిన నోరు: ఆ పెదవు లెప్పుడూ కాశ్మీరకుసుమాలవలె ఎరుపు లలమి ఉంటాయి.

నేను ఆ బాలికను ఏదో దివ్యానురాగంతో నాహృదయాంతరంలో పూజిస్తున్నానని నేనే అనుకోన డానికి భయపడి, అలాటి ఆలోచనలు రానిచ్చేవాడిని కాను. ఆమెకు చదువుచెప్పేటప్పుడు ఎంతో మధురమైన తన కంఠంతో ప్రశ్నలు వేసే సమయాల, ఆమె వాక్కులలోని ప్రతి-చిరుస్పందనమూ నా హృదయాన్ని 'మైకు'ను చేసి ప్రతిస్పందనమై నా జీవితం అంతా ఆ అమృతశబ్దాలతో తరంగితమైపోయేది. వారింటిలో ఉన్న ఆ మూడునెలలూ నా విషయమై స్వయంగా ఆ బాలికే అన్ని ఏర్పాట్లు చేసేది. ఏ లోటూ జరగనిచ్చేదికాదు.

నాకూ, ఆమెకూ వింధ్యాచలం అడ్డం. ఆ పర్వతశిఖరాలూ, లోయలూ, నర్మదాతపతులూ, నా జీవితానికీ, ఆమె జీవితానికీ, నా ఆలోచన పథంలో శాశ్వతంగా అడ్డంవచ్చినవి-అనే నిశ్చయం నాకు మొదటనే ఉద్భవించింది.

"నాకే వివాహసంబంధం ఏర్పాటైలేదు ఆనందమయీ! నేను ఎప్పుడూ ఆ విషయమై ఆలోచించుకోనేలేదు."

"మీరు ఏ బాలికనైనా ప్రేమించినారా?"

"ఆ! నాకు ప్రేమ అంటె ఏమిటో తెలియదు. నా పరిశోధనా, నేనూ, అంతే నా బ్రతుకు. నేను ప్రేమిస్తే గీమిస్తే నా పరిశోధననే."

"అబద్ధం ఆడకండి. ఒకరోజు మీరు తెలుగు భాషలో ఏదో పాట పాడుతూన్నారు. ఆ పాట చాలా అందంగా ఉంది. ఏమిటండీ ఆ పాట అని అడిగినాను. మీరు సిగ్గుపడుతూ ఆ పాట కర్థం చెప్పినారు. మీ కవులలో కిషణ్ శాస్త్రిపాట అన్నారు ఇదంతా జ్ఞాపకం ఉందా?"

"ఉంది, ఆనందమయీ!"

"ఆ పాట అర్థం వినగానే, మీ హృదయంలో కొన్ని రహస్యస్థలాలు నాకు దర్శన మిచ్చాయి. నిజం చెప్పండి ఎవ రా అమ్మాయి.

"నిజం చెపితే నీకు కోపం రాదుకదా!" నాగుండె ఝుంఝూవేగం తాల్చింది.

"నాకు కోపం ఎందుకండీ?"

"నీ ప్రశ్నకు జవాబు చెప్పేముందు ఎందుకు నీ వీ ప్రశ్నలు వేస్తున్నావో అడగవచ్చునా?"

"అడగండి. నాకు కారణం ఉంది. అయినా తర్వాత చెప్తాను. ముందు మీరు నా ప్రశ్నకు జవాబు చెప్పండి!"

"నిన్ను గురించే!" అనేశాను. ఏం చేయను. నన్నా పరిస్థితిలోనికి ఆ అమ్మాయి తీసుకువచ్చింది.

"నిజం?"

"నిజం!"

"సరే! నేను చెప్పే కారణం వినండి. మీ హృదయంలో నన్ను ఎందుకు తలపోసుకుంటున్నారో, ఏమో? నేనుమాత్రం మిమ్మల్ని, మీరు మాయింటికి వచ్చిన మొదటిక్షణంలోనే ప్రేమించాను. నా సర్వస్వమూ ఆక్షణంలో మీకు దత్తమైపోయింది. మీరు చూపుల్లోగాని, మాటల్లోగాని మీ హృదయం ఏమిటో నాకు ఎంతకాలమో అర్థం కానియ్యలేదు. ఆ పాటతో నాకు కొంత అర్థమైంది. 'తొలి ఉషస్సును నేనె, తొలిప్రేయసిని నేనె!' అని."

ఆ మాట లా బాలిక అంటున్నది, నా గుండె ఆగిపోయింది! ఎక్కడ వింధ్యాచలం. కలలో నన్నా అంత దివ్యమైన పవిత్రనాదంతో నిండిన మాటలు వింటా నని ఊహించుకో లేదు.

"నిజమేనా! ఆనందమయీ...ని...ని... నిజమేనా?"

ఆ అమ్మాయి మోము ఏదో పరమాద్భుతకాంతులతో వికసించిపోయింది. స్వచ్ఛమైన చెంపలు అరుణరాగరంజితమై ఆమె కన్నులు జ్యోత్స్నాపూర్ణ కిరణాంకితమై ఆమె ఫాలము ఆనందక్షీరవీచీమూర్తిమంతమై నాకు దర్శన మిచ్చింది.

'ఆనందమయీ ఏమి చెప్పను. ఈ ఆలోచన ఆలోచించడానికికూడా తగనివాడిని. నువ్వు దివ్య సౌందర్యవతివి. ఉత్తరాదిబాలవు, భాగ్యవంతులబిడ్డవు"

'అయితే? ఇవి మీ ప్రేమకు అడ్డాలా?' ఆనందమయి నా వంక ఆశ్చర్యంగా చూచింది. 'కాబట్టి మీరు భయపడిపోయారా?'

ఎవరైనా మామాటలు వింటున్నారేమోనని భయపడినాను. మాతోపాటు ఆ ప్యాసింజరులో ఆసెకండు స్పెషల్ తరగతిలో ఇద్దరో ముగ్గురో ప్రయాణం చేస్తున్నారు. వాళ్ళు మమ్మ భార్యాభర్తలే అని అనుకున్నారు కాబోలు. మా యిద్దరికి ఒకసీటు వదలివేసి తాము ఇతరసీట్లు ఆక్రమించినారు. వారు మాకు దూరంగానే ఉన్నారు.

"కాదా ఆనందమయీ! మీ నాన్నగారూ అమ్మగారు, ఒప్పుకుంటారా ? మీ అక్కగారూ బావగారూ తెల్లబోరూ."

"నిజమే!"

"తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టిన కృతఘ్నుడను అయిపోనూ! వారి దృక్పథంలో!"

విషాదచ్ఛాయలు ఆక్రమించిన చిరునవ్వు ఆమె మోముపై ప్రసరించింది. "మా అక్కకూ నా హృదయం తెలియజేశాను. ఆమె మా బావతో చెప్పింది. మా బావకూ చాలా ఆనందం కలిగింది. అందుకనే మా బావ మిమ్మల్నికూడా బార్లైలీ రమ్మన్న కారణం. మా అక్కో, బావో ఈసంగతి మీతో మాట్లాడుదామను కున్నారు. నేనే వద్దన్నాను. నేనే మీతో మాట్లాడాలని నిశ్చయించుకున్నాను. మా తండ్రిగారు ఇష్టపడక పోవచ్చును. కాని నేను అన్నింటికీ సిద్ధంగా ఉన్నాను. నా కిప్పుడు పందొమ్మిది. నేను మేజరు నయ్యాను."

"ఆనందమయీ !"

"ఏమండి ?"

"నువ్వు - నువ్వు అవతరించిన దేవతవు - నన్ను - ఈ వికారిని నిజంగా—"

"ప్రేమిస్తున్నానా, అంటారా? మీకు నమ్మకం లేదా? వాళ్ళంతా చూస్తున్నారుగాని, మిమ్మల్ని గాఢంగా నా హృదయానికి—"

"నేను నిన్ను దరికైనా తీసుకోలేని దద్దమ్మను–"

"మీకు ధైర్యం లేదు. మీ హృదయాన్నే మీరు నమ్మలేరు."

"ఒక దేవకన్య—"

"నేను దేవకన్యనూ కాను. మీరు దేవులూ కారు. మన ఇద్దరమూ మానవత్వము పూర్ణంగా స్పందించే మానవులం. మీ అభిప్రాయం చెప్పండి."

'ఎక్కడ నిన్ను ప్రేమించిపోతానో అని భయపడి పోయాను. నా సంగతి ఎవరు గ్రహిస్తారో అని భయపడిపోయాను. పాఠం చెప్పేటప్పుడు, నువ్వు నేనూ ఒంటిగా ఉన్నప్పుడు నా పూజ ఎక్కడ బయలుపడిపోతుందో, నీ ప్రేమ గ్రహించిపోతావో, నిన్నేమి బాధపెట్తానో అని లోలోన గజగజ వణికిపోయాను దేవీ!"

"అంత గాఢంగా ప్రేమిస్తున్నారుటండీ నన్ను! ఎంత ఆనందం? మీ హృదయం ఏమీ గ్రహించలేకపోయాను. మీరు గొప్పశాస్త్రవేత్తలే కాకుండా, మంచినటకులు కూడా!"

"నాకు నిన్ను ముట్టుకోవడమే భయం వేసేది. నువ్వునన్ను స్పర్శించినప్పుడు ఏం మూర్ఛపోతానో అని బిఱ్ఱబిగుసుకుపోయేవాడిని."

"అదా అసలువిషయం. నేను మిమ్మల్ని ముట్టాలనే ముట్టుకునేదాన్ని. ఏ వంకనో మీ చెయ్యి, మీ భుజం స్పృశించేదాన్ని. ఏమాత్రం వీలుదొరికినా మీ దగ్గరగా కూర్చునేదాన్ని. మీరు బిగుసుకు ఉన్నారు. మీహృదయంలో ప్రేమ లేదు. ఎందుకు నన్ను నేను ఇంత చులకన చేసుకుంటున్నాను. అని ఒంటిగా ఉన్నప్పుడు బాధపడేదాన్ని సుమండీ! ఈ నాటికి నా జన్మ సాఫల్యం అయింది."

"అయ్యో వెఱ్ఱిదానా! మీ నాన్నగారు ఒప్పుకోరే. మనగతి ఏమిటి ఇకముందు?"

"ఆయన ఒప్పుకున్నా సరే, లేకపోయినా సరే, మన వివాహం తథ్యం"

మా ప్రయాణం మహదానందపూర్ణమై సాగిపోయింది.

మేం అలహాబాదు వెళ్లినరాత్రే తల్లిదండ్రులతో తన వివాహం సంగతి చెప్పింది కాబోలు. అప్పటికి తొమ్మిది గంటలయింది. చరచరా నేనున్న గదిలోనికి త్రివేదీగారు చక్కా వచ్చారు. "ఇంత ద్రోహివని అనుకోలేదే నిన్ను. ఇంత కుట్ర పన్నుతావురా? నువ్వు మా ఇంటిలోనుంచి వెంటనే వెళ్ళిపో. తలక్రింద మూడు తలల శిఖండిని పెట్టుకున్నానో! రాక్షసుడా!" అని అగ్నిబాణాలవంటి మాటలు తుపాకీ పేల్చారాయన. నేను నిలువునా నీరయిపోయినాను. తుపాకీ పేలుస్తే నీరెల్లా అవుతానులెండి. శాస్త్రనిజం కాదామాట. గుండెనూసుకుపోయి రక్తహీనణ్ణయి ఉంటాను. వారు రాగానే నిలుచుండి నమస్కరించాను. ఏవేవో భావాలతో ఆయనకు నచ్చచెబుదా మనుకున్నాను. ఆయన అగ్నిహోత్రుడే. మాటలూ, వాదనలూ వినే శాంతమే లేదు.

"వెంటనే వెళ్లు! సిగ్గూ లేదు. లజ్జా లేదు. ఇంటిలో మదరాసీవాణ్ని ప్రవేశపెట్టుకోడానికి నా కేమీ ఇష్టం లేదు. కాని ఆ మూర్ఖురాలు, జ్యోతిర్మయికి మంచీ, చెడ్డా ఏమన్నా తెలుస్తేనా?"

నేను మౌనం వహించి తలవాల్చుకుని నిలబడి ఉన్నాను,

"నువ్వు బందిపోటువు. వెనకనుంచి బాకుతో పొడిచి చంపే నీచ హంతకుడవు!"

నా హృదయం పాతాళాలకు క్రుంగిపోయింది

"నువ్వు ఠగ్గువు, పిండారీవి!"

ఇంతట్లో ఆ గదిలోనికి ఆనందమయి క్రోధసంతప్తవదనంతో విసవిస నడిచివచ్చింది.

"నాన్నగారూ! ఇక నోరు మూయండి.

నా భర్తను నోటికి వచ్చినట్లు తిట్టడానికి నీ కధికారం ఎవ రిచ్చారు?"

"నీ భర్తా? అప్పుడే పెళ్లికూడా అయిందీ? ఎంత కొంప ముంచావు?"

"నేను కొంప ముంచలేదు. మీ కొంప తరింప చేశాను. మీరు వేయి సంవత్సరాలు తపస్సు చేసినా ఇటువంటి అల్లుణ్ణి సంపాదించలేరు. మీ ఇంటిలో ఒక్క నిముషం మే మిద్దరమూ ఉండము. రండి చతుర్వేదిగారూ! మీ సామాను సర్దుకోండి. నా సామాను సర్దుకొని నేనూ వస్తున్నాను.

"నీ సామా నే ముంది. అంతా నేను కొని ఇచ్చిందే!"

"నా కిచ్చిన వెనక నాసామా నే! అయినా మీ రిచ్చినది నే నేమీ తీసుకువెళ్ల దలుచుకో లేదు. మాయి తన భూముల రాబడిలోనుంచి వచ్చిన అయిదు వేలలో నాకు రెండు వే లిచ్చింది. అవి పట్టుకు వెళ్తాను. ఇవిగో మీ రిచ్చిన నగలు."

ఆ బాలిక నెమ్మదిగా తన మెడలోనుండి చేతులనుండి కొన్నినగలు తీసి బల్లమీద పెట్టింది. నా చేయి పట్టుకుని గదిలోనుండి, హాలులోనుండి, మెట్లమీదనుండి క్రిందిహాలులోనుండి వీధిలోనికి నడిచి వెళ్లిపోయింది. వీధిలో మే మిద్దరమూ అలా చేయి చేయిపట్టుకునే అలహాబాదుస్టేషను వరకూ నడిచి పోయాము.

ఆనందమయి హృదయంలో ఏ తుపానులు వీస్తు న్నాయో నాకు తెలియదు. నా హృదయంలో వేసవి కాలపు గాడ్పులో ఏవో నిండిపోయాయి. ఈ బాలిక జీవితము భగ్నం చేశానా?? వింధ్యాచలం ఎంతపని చేశాడు. ఎందరి జీవితాలు విచ్ఛినం చేస్తున్నాడు! కాదు. దేశంలో ఎన్నిత్రివేణీసంగమాలు సాధ్యము చేస్తున్నాడో!

"ఆనందమయీ, నీ తలితండ్రుల్ని, నీ భావి భాగ్యభోగాలను అన్నీ వదిలి ఇలా నాతో వచ్చేస్తున్నా వే!"

"మీతో నేను రావడ మేమిటి, మీరే నాతో వచ్చేస్తున్నారు. మీ భావి ఆంధ్రబాలికావధువును, మీ చుట్టాలను, పక్కాలను, మీ దేశంలో మీకు మీ చుట్టాలలో గలుగబోయే గౌరవాన్ని, అన్నీ వదిలి నాతో వచ్చేసున్నారు."

మే మిద్దరం అంతదూరమూ నడిచే వెళ్ళినాము. స్టేషనులోకి వెళ్ళి మొదటితరగతి విశ్రాంతిమందిరంముం దున్న కుర్చీలలో కూర్చున్నాము. ఎక్కడికి పోవాలి? మా ఊరు పోవాలా? ఎక్కడికి? నా కేమీ ఆలోచనలే లేవు. అనుకున్నంతా అయింది. ఆ దేవి తనంత తాను తన ప్రేమ నాకు తెలిపింది గొన్నిగంటలముందే కాదూ. ఆ ఆనందతరంగము ఏ ఆకాశపథాలకో మమ్మిద్దరినీ ఎత్తుకుపోయింది. ఆ కల్లోలము అక్కడే మాయమైంది. ఆ ఎత్తునుంచి ఎంతో లోతుకు గభీ మని పడిపోయాము.

ఆనందమయి మాటలాడక అతితీక్షంగా చూడని చూపులతో ఏవో చూస్తున్నది.

ఇంతట్లో గబగబ జోడుచప్పుడు అవుతుండగ త్రివేదిగారు మేము కూర్చునివున్న కుర్చీలదగ్గరకు చక్కా వచ్చాడు. "చతుర్వేదిగారూ. నా కోపానికి మీరు క్షమించాలి. మిమ్మల్ని అనరాని మాటలు అన్నాను. ఈ నవ్యయుగంలోకూడా నేను మహాతెలివైనవాడిలా ప్రవర్తించాను. నన్ను మీరు సంపూర్ణంగా క్షమించాలి. బేటీ. నీ ముసలితండ్రి తెలివితక్కువగా అన్న మాటలు పాటించక, నన్ను క్షమించి ఇంటికి రా తల్లీ" అని అంటూ ఆయన కుడిచేతితో కొమరితచేతిని, ఎడమచేతితో నా చేయిని పట్టుకొని, మా ఇద్దరిని లేవదీసి నడిపించుకు తీసుకు వెళ్లాడు.

బైట వారి పెద్దకారు సిద్ధంగా వున్నది. కారులో త్రివేదిగారి సతి కాళిదాసిగారున్నారు.

"చతుర్వేదిగారూ, మీరు ముందు కూచోండి. నేను అమ్మాయి వెనకాల కూర్చుంటాము.' అనిఅంటూ త్రివేదిగారు నన్ను ముందుసీటులో కూర్చోబెట్టితాను

ఆనందమయి వెనుకసీటులో కూర్చున్నారు. ఆనందమయి ఏమీ మాటాలేదు. నేనూ ఏమీ మాటలాడలేదు.

ఇంత తొందరగా ఆయనలో మార్పు కలిగిందేమిటి? ఆనందమయితల్లి త్రివేదిగారికి గట్టిగా ఏమయినా చెప్పిందా? నా చరిత్ర సుఖాంతం కొదలచుకొని వున్నదా? ఇంతమార్పు ఇంతలో ఆయనకు కలగడం అత్యాశ్చర్యకరమే. ఆయన సహజంగా చాలా సున్నితమైన మనసు కలిగినవాడై వుండాలి. ఒక్కసారి వింధ్యప్రాంతానికి ఉత్తరదక్షిణాలకు వివాహసంబంధం కలగడం ఆయన మనస్సుకు వజ్రాఘాతంలా తగిలి వుండవచ్చు. కాని ఉత్తమ హృదయం కలవాడవడంబట్టి ఆశయాలు అభిప్రాయాలు ఎన్ని వున్నా మనసు మార్చుకోక తప్పింది కాదు. అని అనుకొన్నా.

ఇంతలో వారి భవనంముందర మా కారు ఆగింది. మేమంతా దిగి లోనికి వెళ్ళిపోయాము. ఆ రాత్రికి నేను ఆనందమయిని కలుసుకొనడానికి వీలు లేకపోయింది. నాకు రాత్రి ఏమీ నిద్ర పట్టలేదు. లేచి కూర్చున్నాను, పడుకున్నాను. గది అంతా బోనులో వున్న జంతువులా పరిక్రమించాను. మనసులో ఏదో తెలుసుకోలేని ఆవేదన. ఏం చేస్తారు త్రివేదిగారు? ఇంతత్వరలో మార్పు రావడం నిజమైన విషయమేనే? ఏదైనా భయంకర రహస్యం వెనకాల దాగివున్నదా? ఏ ముంటుంది! నా యీ నీరసపుమనసులో ఏవో వికృతమైన ఆలోచనలు పుడుతూవుంటాయి.

గంటలు వరసగా కొట్టుకొంటూ గడచిపోతున్నవి. నాకు కాలం ఆగిపోయినట్లే కనపడింది. అంతుతెలియని ఆలోచనలు. చూపు ప్రసరింపలేని అగాధమైన స్థలాలు. దారి కనపడరాని కంటకభూయిష్ఠమైన చీకటి అడవులు. ఎక్క వీలులేని ప్రాంతాలు కలిగిన ఎత్తైన కొండలు. ఆటంలో అంతర్గర్భితమైన సాత్యుస్వరూపుడైన ప్రోటనులోని మహాశక్తి, కాలాంతకగర్జనతో విచ్ఛిన్నమైపోయిందా?

తెల్లవారింది. నేను స్నానాదికాలు నిర్వర్తించుకుని గదిలో కూర్చున్నాను. వంటమహరాజు కాఫీ, పండ్లు, పూరీలు, తర్కారీ పట్టుకువచ్చాడు. ఏదో కతుక్కతుగ్గానే తిన్నాను. ఈ సమయంలో త్రిపాఠీగారు వుంటే ఎంత సంతోషంగా వుండేది. చల్లగా హాయిగా ఒడుదుడుకులు లేకుండా సాగిపోయే నా జీవితం పతనాలై, ప్రభంజనతాడితకల్లోలాలై, రాళ్లలో, గుట్టల్లో, మెరకపల్లాల ప్రవహించడానికి సిద్ధమైపోయింది. అంత దారిద్ర్యంలోనూ చెక్కుచెదరని ధైర్యంతో, కలో, గంజో తాగుతూ గౌరవంగా బ్రతికివచ్చిన నేను ఏమి కష్టాలకు లోబడాలో అన్న ఆలోచన కలిగింది.

ఏమికష్టా లయితే నేమి? ఎన్ని హింసలకు లోనయితే నేమి, జీవితం ప్రచండపూరితసమస్యలను ఎదుర్కొనవలసివస్తేనేమి, ఈ సర్వసౌందర్యరాసి, ప్రేమమయి ఆనందమయి, నన్ను తన్నుతా వలచి వచ్చినప్పుడు, ఆ పవిత్రాదృష్టాన్ని జీవితంమధ్య దాచుకొంటానుగాక!

ఈ ఆలోచన వచ్చింది. ఏదో చప్పుడు విని తల ఎత్తాను. నా దేవి, నా ఆత్మేశ్వరి, ఆనందమయి వస్తున్నదని గుమ్మం దీక్షగా చూచాను. గుమ్మంలో ఇద్దరు పోలీసుఇన్‌స్పెక్టర్‌లు ప్రత్యక్షమయినారు. అందులో పెద్దఅతను "హల్లో! చతుర్వేదిగారూ, గుడ్ మార్నింగ్, మీ మీద ఒక వారంటు జారీ అయిందండి. మిమ్మలను అరెస్టు చేస్తున్నాము. క్షమించాలి. మీరు మాట్లాడకుండా నాతో రండి. మేమేమీ గడబిడచెయ్యం. మా పోలీసుకారు ఆవరణలోకే తీసుకువచ్చాము. ఎవ్వరికీ తెలియకుండా చలిచప్పుడూ కాకుండా వెళ్లిపోదాము. మా డిప్యూటీ కమిషనర్ త్రివేదిగారితో మీ అరెస్టువిషయమై మాట్లాడుతున్నారు." అని చలిపిడుగులలాంటి నాలుగుమాటలూ అని నవ్వుతూ నిలుచున్నాడు. నా స్థితి వర్ణించుకోలేను. తల తిరిగిపోయింది. తూలి పడబోయాను. రెండవఇనస్పెక్టర్ గభుక్కున వచ్చి నన్ను అదిమి పట్టుకొన్నాడు. నే నింతటిలో ధైర్యం తెచ్చుకొని "ఎందుకండీ వారంటు" అని ప్రశ్నించాను.

"మీరు హాస్టల్‌లో ఏవో అరాజకపు పనులు చేసేందుకు కుట్ర పన్నారట" అని ఏవో కాగితం టపటప ఆడిస్తూ చూపించినాడు.

"ఇదేదో చాలా పెద్దపొరబాటు. మీరు వైస్ ఛాన్సలర్ గారిని అడగండి. మీరు చాలా భ్రమపడు తున్నారు. ఆ వారంటు నా మీద అయివుండదు. ఈ విషయంలో త్రివేదిగారు ఏమన్నారు?"

"త్రివేదిగారు ఏమంటారో మాకిప్పుడు ప్రస్తుతం అవసరం లేదు. మిమ్మల్ని ఈ రాష్ట్రాన్నుంచి పంపించివేయడమే ఈ వారంటులోవున్న విషయం. ఆలస్యమైపోతున్నది రండి, లెండి" అని అంటూ అతడు నాదగ్గరకు వచ్చి చేయిపట్టుకొన్నాడు. నేనిక మాట్లాడకుండా వారితో నడచివెళ్ళి త్రివేదిగారి భవనం ముందు పోర్చిలో నిలుచునివున్న పోలీసు కారులో ఎక్కి కూర్చొన్నాను. నా ఇరుప్రక్కలా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు కూర్చున్నారు. మా కారు సాగిపోయింది.

౪

ఆ కారు ఎంత దూరం వెళ్ళిందో ఎంత కాలం నడిచిందో నేను గమనించే స్థితిలో లేను. నేను ఏదో భయపడినది నిర్ధారణ అయినది. నేనేమిటి, కుట్ర చేయట మేమిటి! ఇది త్రివేదిగారు పన్నిన పన్నుగడ అని, తళుక్కుమని నాకు ఆలోచన హృదయంలో మెరుపు మెరిసింది.

ఆనందమయి గతి ఏమవుతుంది. ఆబాలికకు ఈ విషయం తెలిసిందా? నామీద నిజంగా ఏదయినా కృత్రిమపు, ఘోరమైన నేరం ఆరోపించారా? నాగతి ఏమౌతుంది.? దీనివల్ల నా డి. ఎస్. సి. పరీక్షకు అంతరాయ మేమయినా కలుగుతుందా? ఆనందమయిని ప్రేమించడమే తప్పా. ఆ బాలిక తనంత తాను తన ప్రేమను తెలుపుకోకపోతే నా ప్రేమను నేను తెలిపివుండేవాడిని కాదే! ఉత్తమంగా, ధర్మంగా ప్రేమించుకొన్న ఇద్దరు యువతీయువకులమధ్య వింధ్యాచలేశ్వరుడు అడ్డం వస్తాడని నాకు ఈషన్మాత్రం ఆలోచన తట్ట లేదే! వింధ్యాచలేశ్వరుడే నాకీ దివ్యప్రేమను ప్రసాదించాడు. ప్రేమ అణుశక్తి కన్న మహత్తరమైన శక్తి కలది. సీసంవంటి నా బ్రతుకును బంగారంకింద మార్చివేసింది.

మా కారు సాగిపోతూవుంది. నేను కారులో ఒళ్లు తెలియని నిద్రకు లోనయ్యాను. మెలుకువ వచ్చేసరికి మేము కాశీకి వచ్చినాము. మా కారు బెనారస్ కాంటొన్మెంటుస్టేషనుదగ్గిర ఆగింది. మేము ముగ్గురం దిగాము. అరెస్టుచేసిన ఇన్‌స్పెక్టరు నన్ను చూచి, "చతుర్వేదిగారూ! మీపైన వారంటుమాట అబద్ధం. త్రివేదిగారు మాకు గాఢమైన స్నేహితులు. వారికీ సహాయం చేయమంటే మేము చేసినాము. మీ సామాను పుస్తకాలు వగైరా అన్నీ వారి బంట్రోతు 'సేతూరాం' పట్టుకువస్తాడు. మీరు ఇక్కడే ఉండండి. మీకు ఖర్చులకై ఈ రెండువందలు ఇమ్మని త్రివేదిగారు మా చేతి కిచ్చారు. ఈ కారు వారి స్నేహితుని కారు. మీరు మామీద రిపోర్టువగైరాలు చేయకండి, మీ పుణ్యం. మా ఉద్యోగాలు పోతాయి. ఆయన చేసిన పని మా కేమీ నచ్చలేదు. ఈరోజుల్లో కూడా త్రివేదిగారు ఇలా చేయడం చాలా పొరపాటు. ఈ విషయం ఇంతటితో వదలదు. ఆనందమయి అంటే మాకందరికీ ఎంతో ఆపేక్ష." అని అంటూ రెండు నూరు రూపాయల నోట్లు నా చేతిలో పెట్టబోయాడు.

"ఇన్‌స్పెక్టరుగారూ, నాకా నోట్లు వద్దు. త్రివేదిగారికీ మీకూ నా గాఢ అభివందనాలు. మీరంతా చాలా గొప్ప నాటకం ఆడారు. మీరంతా ఏదైనా. సినిమ కంపెనీ పెట్టి, అందులో వేషాలు వెయ్యవలసినవారే. నెహ్రూగారి కొమరిత ఇందిరాదేవి ఒక పార్సీయువకుని పెళ్ళిచేసుకుంటే తండ్రి వద్దనగలిగారా? రోజులు మారిపోయాయి. మనకు పూర్ణస్వాతంత్ర్యం వచ్చింది. కాని మనదేశం హిట్లరురాజ్యం కాదే. అయినా మీరు కోరినారు గనుక మీపైన రిపోర్టు చేయను." అని నేను వారిని వదిలి ప్లాటుఫారంమీద వేరేచోటికి వెళ్ళినాను. టిక్కట్లమ్మే స్థలానికి వెళ్లి వెంటనే అలహాబాదుకు పోయే బండికి టిక్కెట్టుకొని ఆ బండి రాగానే వెళ్ళిఅందులో కూర్చున్నాను. పోలీసు వారిద్దరూ తిరిగి కారులో

వెళ్లిపోయారు. నేను అలహాబాదుకు తిరిగి వస్తానని వారికి తెలియదు. అలహాబాదుకు సాయంకాలం చేరుకున్నాను. స్టేషన్‌నుండి ఒక హోటలుకుపోయి భోజనంచేసి, టాక్సీ చేసుకొని మా గురువుగారైన రాం ప్రసాద్ విద్యాలంకార్ గారి ఇంటికి వెళ్లాను. మా గురువుగారు ఎంతో ఆదరంగా నన్ను ఆహ్వానించారు. డాక్టరు విద్యాలంకార్ ఇంగ్లండు,అమెరికా'డాక్టర్ ఆఫ్ సైన్సు' డిగ్రీలు పొందివచ్చిన ప్రజ్ఞావంతులు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఆచార్యోత్తములు. ఆయన నన్ను తమ పుత్రునికన్న ఎక్కువగా ఆదరించేవారు. వారి శిష్యునిగా ఉన్న ఈ రెండేళ్లూ నన్ను అత్యంత ప్రేమతో వేయికళ్లకని పెట్టి ఉండేవారు.

"ఎక్కడనుండి వస్తున్నావు చతుర్వేదీ ?"

"కాశీనుంచి పితాజీ ?"

"కాశీకి ఎప్పుడు వెళ్లావు. బారైలీ వెడుతున్నానని చెప్పావుగా అక్కడనుండే తిన్నగా కాశీకి వెళ్లావా ?"

"లేదండి. ఆ కథ అంతా రామాయణం అంత ఉంది !" అని జరిగిన విషయాలన్నీ మనవి చేశాను.

"రాం ! రాం ! త్రివేది ఇంతటి పని చేశాడా ! వారి కుటుంబం నాకు బాగా పరిచయమే ! జ్యోతిర్మయినీ, త్రిపాఠీని, ఆనందమయినీ బాగా ఎరుగుదును. వారంటే. నాకు ప్రాణం ! సరేకాని ఆ ఇన్‌స్పెక్టర్లను చివాట్లు పెడతాను. నువ్వు ఇక్కడే నా ఇంట్లో ఈవిషయం ఏదో తేలేవరకూ ఉండు. ఇల్లు నీదే. ఏమీ మొహమాటం పడకు, మీ గురుపత్ని నీవంటే ఎంతో ఆనంద పడుతుంది."

అని తన భార్యకడకు తీసుకువెళ్లినారు.

అక్కడ ఆయన నా కథఅంతా భార్యతో చెప్పినారు. ఆమె చాలా ఆశ్చర్యం పొందింది. ఆమెకు నలుబది ఏళ్లుంటాయి. నన్ను "బేటా, చతుర్వేదీ!" అని పిలుస్తారామె. ఆమె ఇంటరుప్యాసయిన ఇల్లాలు. హిందీలో కవయిత్రి. రేడియోలో తాము రచించిన గీతాలు తీయని కంఠంతో పాడుతూఉంటారు. జ్యోతిర్మయి ఆనందమయి లంటే ఎంతో ఇష్టం ఆమెకు. ఆనందమయీ నేనూ మా ఆచార్యులవారి దగ్గరకు ఎన్నిసార్లో వచ్చేవారం. ఆనందమయి మా గురుపత్నితో అరగంటైనా సంతోషంగా కాలం వెళ్లబుచ్చకుండా ఇంటికి ప్రయాణం కాదు. మా గురుపత్ని పేరు ఉమాసుందరీదేవి.

ఉమాసుందరీదేవి :—ఏమయ్యా చతుర్వేదీ లోకమోహిని అయిన బాలికను వశపర్చుకున్నావే. ఏమన్నా వశీకరణమంత్రం ఉపదేశమయ్యావా?

నేను :—మీ ప్రయాగత్రివేణీసంగమంలో స్నానం చేయగానే మా కెన్నో మహత్తరశక్తులు సన్నిహితం అవుతాయి మాతాజీ !

ఉమ :— కాదయ్యా! మీ దక్షిణాదివారికి చాలా మంత్రతంత్రాలు వచ్చునని మావైపు ఎంతో ప్రతీతి.

నేను :—అలాగే మావైపున ఉత్తరాది వారంతా మహర్షులనీ, వారి ఇళ్లల్లో దేవతలు పరిచారికలుగా తిరుగుతూఉంటారని మావాళ్లు చెప్పుకుంటూ ఉంటారు. మా అమ్మ నేను మీ విశ్వవిద్యాలయంలో జేరడానికి వచ్చేముందు, "నాయనా మాయచేసి తీసుకుపోయి దేవికి బలియిస్తారు. జాగ్రత్త" అని చెప్పింది.

ఉమ :—రాకపోకలు తక్కువై, పరిచయాలు ఏమాత్రమూ లేక ఈలా అవకతవక అభిప్రాయాలు ప్రచారంలోకి వస్తాయి.

గురూజీ :—చతుర్వేదీ! నువ్వు బాగా విశ్రాంతి తీసుకో. నీ కో గది సిద్ధంచేయిస్తాను. రేపు ఉదయం అన్ని విషయాలు మాట్లాడుకొందాము.

వారి ప్రేమ నా హృదయానికి వర్ణింపలేని శాంతి ప్రసాదించింది. నాకు ఒళ్లుతెలియని నిదుర పట్టింది. సాయంకాలం ఉలిక్కిపడి లేచాను. ఆనందమయి వచ్చి నన్ను తన హృదయానికి అదుముకొన్నట్లు కల వచ్చింది. ఆ కలలో నా కౌగిలిలో నుండి ఆ బాలికను ఆమెతండ్రి ఒరబరా లాక్కొని

పోయినట్లు వచ్చి "ఓ" అనిగుండె దడదడమంటూ ఉండగా లేచాను.

ఎంతవరకోగాని నా కా దడ తగ్గలేదు. లేచి స్నానాలగదికి వెళ్లి వచ్చాను. మా గురువుగారి దుస్తులు నా గదిలో సిద్ధం చేసిఉంచారు. అవి ధరించి, నా గదిముందు హాలులోనికి వచ్చేసరికి ఆనంద మయి ఎదురుగుండా నన్ను రక్షింపవచ్చిన పరమసాన్ని ధ్యంలా నిలుచునిఉంది. ఇం కెవ్వరూ ఆ హాలులో లేరు.

నన్ను చూడడ మేమిటి ఆమె రెక్కలు వచ్చి నట్లు నాదగ్గరకు వాలి నా కౌగిలిలో ఒదిగిపోయింది.

"నా దివ్యదేవీ!"

"నా పరమదేవా!"

ఆమెను నా గదిలోనికి తీసుకొనిపోయాను. అలా ఒకరి కౌగిలిలో ఒకరం ఒదిగిపోయి వున్నాము మా ప్రేమకు మాటలు లేవు,

"ఇంతట్లో తలుపుదగ్గిర పండిజ్జీ!" అని వంట మహారాజ్ మాట వినబడింది.

మేము ఇద్దరమూ కౌగిలిలోనుండి విడిపోయి చెరి ఒక కుర్చీమీద కూర్చున్నాము. మహారాజ్ బల్ల మీద ఫలోపహారాదులు, కాఫీ, అన్నీ ఉంచి "ఇద్దరూ సేవించండి" అంటూ తలుపు దగ్గిరగా వేసి వెళ్లిపోయాడు.

"ప్రీతమ్! మిమ్మల్ని పోలీసువారు తీసుకువెళ్లడం అదీ నాకు ఉమామాయి చెప్పింది. నాన్నగారు అంత క్రూరహృదయులని కలలోనన్నా అనుకోలేదు. నన్ను స్టేషనునుండి ఇంటికి చేరాక లోపలికి తీసుకుపోయి, ఒక గదిలోపెట్టి తాళం వేశారు. అప్పటినుండి ఇంత వరకూ నాకు భోజనం లేదు. ఇంతవరకూ మా అమ్మతో గాని, నాయనగారితోగాని మాట్లాడలేదు. ఏం చెయ్యాలో నేను నిశ్చయం చేసుకొన్నాను. తలుపు తాళం వేసినన్నాళ్లు భోజనం చేయను, ప్రాణం పోతుం దని భయపడలేదు."

"ప్రాణకాంతా! మహారాజ్ఞీ! ఓహో! ఎల్లా వచ్చా విక్కడకు?"

"పక్షిలా మారిపోయి, కిటికీలోంచి దూరి ఇక్క డకు ఎగిరివచ్చి ఇక్కడ మామూలురూపం పొందాను."

"నేనిక్కడ ఉన్నానని ఏలా తెలిసింది?"

"చెప్తా ఉండండి" - అంటూ నా ఒళ్లో కూర్చుంది. "నాకు చాలా ఆకలిగా ఉంది. నాచేత మీరు తినిపిస్తేగాని ఏమీ సహించదు." అని నా మెడచుట్టూ తన ఎడంచేయి వేసింది. కుడిచేత్తో నాగడ్డం పట్టుకుని తన వైపు తిప్పుకొని. "ప్రభూ, నేను నా నిరశనవ్రతదీక్ష మానివేసేముందు మొదటిముద్దగా మీ ముద్దు ఆరగిస్తా నని ప్రతిజ్ఞ చేసుకున్నాను. నాకు మీ ప్రథమ చుంబనము ప్రసాదించండి!" అని నవ్వుతో, ప్రవాహమయిన కంటి నీటితో నావైపు చూచింది.

నాకూ కన్నుల నీరు తిరిగినది. ఆమెను గాఢంగా అదుముకొని మాటలు లేక, కాశీ విశ్వే శ్వరుని మనస్సులో తలచుకొంటూ, ఆమె పెదవులు చుంబించినాను. ఆమె నాకు ప్రతిఫలం ప్రసాదించి నది. మా కంటి నీటి ప్రవాహాలు త్రివేణీ సంగమం అయ్యాయి.

ఆమెచే నెమ్మదిగా టీ తాగించాను. తర్వాత పాలలో నానవేసిన రొట్టె కొంత తినిపించాను. పళ్లరసం త్రాగించినాను.

"ఏం చేస్తున్నారు పిల్లకాయ లిద్దరూ" అని చటుక్కున తలుపు త్రోసికొని మా గురుపత్ని లోనికి చక్కావస్తూ, "ఎల్లా ఉన్నవారు అలాగే ఉండాలి. నేను చూడాలి, నా కళ్లు చల్లబడాలి. నా జన్మ తరించాలి" అని అన్నది.

నా ఒడిలోనుండి ఆనందమయీ, నేను కుర్చీ మీదనుండీ, సిగ్గుపడుతూ లేచి నిలుచున్నాము.

"ఎందుకు లేచారు? నాకు కోపం వచ్చింది. మళ్లీ యథాప్రకారం కూర్చోండి. మీ ప్రొఫెసర్ సాబ్ ఎన్ని అల్లర్లో చేసేవారు."

ఏం చేస్తాం. అల్లాగే యధాతథంగా కూర్చున్నాము. మా ఎదురుగుండా ఉమామాయి కూర్చున్నారు. చెప్పవద్దూ నేను సిగ్గు అణచుకొనడానికి విశ్వప్రయత్నం చేశాను. ఆనందమయి విజయం పొందింది. అల్లరిపిల్ల! చెయ్యాలని నా జుట్టు సవరించింది. నా మోము అదిమిపట్టి తనవైపు త్రిప్పుకుని, ఒక నిమేషం తేరిపారచూచి, ఉమామాయి వైపు త్రిప్పి, "ఏమండి పిన్నీ! ఈ అబ్బాయిమోము బాగానే ఉం దనుకుంటాను. దక్షిణాదివారంతా కోతు లనుకున్నాము. కాదని కొంచెం నిర్ధారణ అయింది సుమండీ!" అని అంటూ మోములో గంభీర ముద్ర తాల్చింది.

ఉమామాయి పకపక నవ్వుతూ "అల్లరిపిల్లా! ఆతనిముందు దివ్విటీముందు దీపంలా ఉన్నావు. కాస్త రంగు ఉంటే సరేనా, నా కొడుకు మన్మథుడు. నువ్వో" అని నవ్వి ఆమెకూడా మోములో గంభీర ముద్ర ధరించింది.

నేను: "ఇంతకూ మే మాంధ్రులం. ఆంధ్రు లెవ్వరో నిర్ధారణ చేశారా!" అన్నాను.

ఆనందమయి: "రాక్షసు" లని అన్నది.

ఉమామాయి: "దేవతలు, దేవతలే!" అని దృఢంగా చెప్పింది.

మేము ఇద్దరమూ లేచి ఆతల్లికి పాదాభివందనాలు చేశాము. ఆమె మా తలపై చేతు లుంచి ఆశీర్వదించి, "చతుర్వేదీ నీ వధువును వాళ్ల తలితండ్రులతో మాయమాటలు చెప్పి తెల్లవారుతూనే తీసుకువచ్చాను. నువ్వు ఈ ఊరు తిరిగి వచ్చేశా వని వా రెవరికీ తెలియదు. నువ్వు ఇంటినుంచి కదలి బయటకి వెళ్లు. ఆనందమయి ఇక్కడే ఉంటుంది. ఆమె పెట్టేబేడా తర్లిం మకువచ్చేటట్లు చేశాను. మీ ప్రొఫెసర్ గారు జ్యోతిర్మయికీ, త్రిపాఠీకి టెలిగ్రాము ఇవ్వడానికి వెళ్లినారు. వీలయితే ట్రంకుఫోనులో మాట్లాడతా మన్నారు. ఈలోగా లక్నో రిజిష్ట్రారుతో మాట్లాడి అక్కడ మీ ఇద్దరికి రిజిష్టరువివాహం జరిగే ఏర్పాట్లు చేస్తూ ఉన్నారు. మధ్యాహ్నం లక్నోకు వెళ్లి వస్తా.రు అపైన సంగతులు ఆలోచిద్దాము." అని ఆమె లేచి "జాగ్రత్తగా వుండండి రెండు మూడు రోజులలో వివాహం; నేనూ, ప్రొఫెసరూ, ఇతర సైన్సుఆచార్యులూ ఇద్దరో ముగ్గురో భార్యలతో లక్నో వస్తారు. ఈ విషయం ఏమాత్రం ఎవ్వరికీ తెలియకుండా ఉంచదలుచుకొన్నాము." అని అంటూ ఆమె తలుపు దగ్గరగా వేసి వెళ్లిపోయింది.

మా ఆనందసుధా సముద్రం అయిపోయింది. ఆనందమయి నా శ్రీమహాలక్ష్మి!

౬

ఆ సాయంకాలానికి జ్యోతిర్మయీ త్రిపాఠీ మా ప్రొఫెసర్ గారి ఇంటికి చక్కా వచ్చారు. జ్యోతిర్మయి చెల్లెలిని కౌగిలించుకొని, "చెల్లీ ఎంత అదృష్టవంతురాలివే!" అన్నది.

రాగానే నా చేయి విరిగేటట్లు జాడించిన త్రిపాఠీ "నువ్వు దురదృష్టవంతురాలవా?" అన్నాడు కోపం నటిస్తూ. "నేనేకాక నా చెల్లికూడా అదృష్టవంతురాలు" అని జ్యోతిర్మయి మాట ముడిచింది.

త్రిపాఠి:—అంతే కద!

జ్యోతిర్మయి:—మీరు మరీనండి. ఏమో, నాకన్న నా చెల్లే అదృష్టవంతురాలే నేమో, ఆలోచిస్తే అలాగే కనబడుతోంది.

మాయి:—ఒకరికన్న ఒకరు అదృష్టవంతులు లెద్దురూ:

ఆ మర్నాడు మే మంతా లక్నో వెళ్లినాము, నాకు ఆనందమయికీ రిజిష్టరువివాహ మయింది.

దారిలో త్రిపాఠీ నాతో రహస్యంగా "మామగారికి నీ మీద కోపం ఏమీ తగ్గలేదు భాయ్! అంతా నీపనే అంటారు. నేనూ జ్యోతీ ఎన్నో చెప్పినాము, ఆయన మనస్సు తిప్పలేకపోయాము. కాని అత్తగారి మనస్సు తిరిగింది." అని చెప్పినారు.

వివాహం కాగానే లక్నోనుండి వెంటనే అలహాబాదు వచ్చివేశాము. నేను తక్క తక్కినవారందరూ త్రివేదీగారింటికి వెళ్లినారు.

మాటలమధ్య నెమ్మదిగా మా గురువుగారు త్రివేదీగారితో అంతా చెప్పినారట. ఆయన నోట మాట రాక కుర్చీలో కూలబడిపోయినారట. కొమరిత పాదాభివందనం చేయడానికి వెడితే "ఛీ దుర్మార్గురాలా నీ మొహం చూపకు నాకు" అని ఆమెను కాలితో తన్నినారట. అంతతో మాగురువుగారు ఉగ్రుడై లేచి "నీసంగతి దేశదేశాల చాటుతాను. ఏ యుగంలో ఉన్నావు నీవు. వింధ్యాచలం ఇంకా ఆకాశంఅంటే ఉందనుకున్నావా!' అని లేచినారట.

త్రిపాఠి "మామగారూ! మీరంత తెలిసినవారూ భక్తుల్లు, గాంధీజీ జవహర్ పండిజ్జీల శిష్యులే, ఈలాంటి వారవుతారని కలలో'నన్నా అనుకోలేదు. కూతుర్ని తన్నారా? నన్నూ, జ్యోతిర్మయినీ తన్నండి. ఈ పరిణామానికి కారకులం మేము. ఆనందమయి చతుర్వేదీని ప్రేమించేటట్లు చేశాము. అతడు ఉత్తముడు- మహోదారచరిత్రుడు. అలాంటివాడు అల్లుడవడం మీరు పూర్వజన్మలో చేసిన పుణ్యం" అని విసవిస అవలకు నడిచిపోయాడట. అందరూ అన్ని విధాలా చెప్పినారట. ఆనందమయి తండ్రిపాదాలకడనే పడివుందట. ఆనందమయితల్లి కాళీమాయివచ్చి కూతుర్ని లేవదీసి అమ్మడూ, నాన్నగారు తన్నినారా? నీకర్మమేమి, నేనూ నీతో వస్తాను పద. ఇంత ఉత్తములే ఇలా అయ్యారేమి! అది నాకర్మ" అంటూ కౌగిలించుకుందట ఆ బాలికను తల్లి.

మా మామగారు సింహంలా లేచారట. "సరే! మీరంతా సంస్కృతికలవారు. నేనుమాత్రం పరమ ఛాందసున్ణి! అనుకోండి. కన్నతల్లీ, నీకూ చతుర్వేదికే నిజమైన వివాహం చేస్తాను. ఆచార్యా! మీరు ఆ శుభకార్యం వైభవంగా జరిపించండి. తల్లీ! నిన్ను తన్నిన్న పాపానికి నాకు నివృత్తి ఏప్రాయశ్చిత్తం చేసుకుంటే పోతుందో!" అని ఆనందమయిని తన హృదయానికి అదుముకొని వెక్కి-వెక్కి ఏడ్చినారట. అప్పుడందరికళ్ళూ చెమ్మగించినాయట. జ్యోతిర్మయీ త్రిపాఠీ, ఆనందమయీ తండ్రికడ సాష్టాంగపడినారట.

నా వివాహం పరమాద్భుతంగా జరిగింది. మా వాళ్లంతా ప్రయాగ తర్లివచ్చారు.

వింధ్యాచలేశ్వరుడు పకపక నవ్వుచున్నాడు భారతదేశంలో అన్నీ నదీనదులూ త్రివేణీసంగమానికి చుట్టాలై వచ్చినాయి.

"ఓం అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ."

